# భగవంతుడు గురువుగా అవతరించిన రూపం

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

గురుపూర్ణిమ ప్రత్యేక వ్యాసం

అటు అవధూతావస్థకు, యిటు శిష్టాచారానికీ, మరొకవంక మత సామరస్యానికీ పెట్టినపేరు శ్రీ శిరిడీసాయిబాబా. అందుకే ఆయన సంపూర్ణమైన దత్తావతారం. ఆధునిక యుగంలో భగవంతుడు గురువుగా అవతరించినరూపం ఆయన.

శ్రేష్ఠుడైన సద్గురువుకీ లక్షణాలుండాలి: (1) బ్రహ్మనిష్ఠ (2) శ్రోత్రియత్వం (3) గురుభక్తి (4) సర్వవ్యాపక, సర్వజ్ఞత్వ, సర్వశక్తిమత్త్వాలు (5) భక్తవత్సలత (6) ఆధునిక యుగంలో సకల మత సమైక్యత (7) బోధనాదక్షత. ఇవన్నీ శ్రీ సాయిలో సంపూర్ణంగా యింకెవరిలోనూ కన్పించనంతగా - ఉన్నాయి. ఇందులో ప్రత్యేకంగా గమనించ దగినవి (1) గురుభక్తి (2) బోధనాదక్షత.

శ్రీ సాయి తమ మహిమకంతకూ కర్తలు తమ గురువేనని భక్తి వినయాలతో చెప్పడమేగాక గురు ప్రసాదమైన యిటుకను యావజ్జీవితము ప్రాణసమానంగా చూచుకున్నారు. తమకెంత సంపూర్ణమైన అద్వైత సిద్ధి ఉన్నప్పటికీ తమ గురువుపట్ల మాత్రం అద్వైతాన్ని ప్రకటించలేదు. తామే ఆ గురువునని చెప్పలేదు. తమ గురువును గూర్చి భక్తితో కీర్తించని గురువు నిషిద్ధుడని శాస్త్రం కూడా. అంతేకాదు- భాగవతంలో వర్ణించబడిన అవధూతవలే శ్రీ సాయి కూడా యావద్విశ్వాన్నీ తమ గురురూపంగా దర్శించేవారు. వినగల్గితే సర్వత్ర సర్వదా గురుబోధ సృష్టియందంతా వినిపిస్తూనే ఉంటుందనీ, చూడగల్గితే ప్రతి వస్తువూ మనకేదో పరమసత్యాన్ని బోధిస్తూనే ఉంటుందనీ చెప్పకనే తెల్పుతూ వచ్చారు. ఒక భక్తుడడిగిన ప్రశ్నకు సమాధానం పూత వేసిన మామిడిచెట్టుగా చెప్పారు. మరొకసారి కప్పను మింగబోయిన పామునాధారంగా చేసుకుని కర్మ, జన్మ, ధర్మతత్వాన్ని బోధించారు. సరైన సాయి భక్తునికి సహస్రాక్షములు, సహస్ర ముఖములుగల ఈ ప్రకృతే గురుస్వరూపం. సృష్టి అంతా నిరంతర గురుబోధ రూపకమైన లీలా ప్రదర్శన. అది తెలియక ప్రత్యేకమైన లీలలను కోరేవారు రాజుగారి ప్రేమను, ఆదరణను కోరక ఒక్కపైసా అడుక్కునేలాటి బుద్ధిహీనుడు. సర్వత్రా సర్వదా సాయినే చూస్తూ సాయిబోధనే వినగలవాడే ఆయనకు తగిన శిష్యుడు. శిరిడీలో మాత్రమే సాయి ఉన్నారనుకునేవారు తమనసలు ఎరుగనట్లేనని సాయియే చెప్పేవారు. పరిపక్వత చెందుతున్న ఉపాసనీబాబాలాటి వారందరికి ఆయన బోధించినది అలా సర్వజీవులలోనూ తమనే చూడమనే, "నీవు చూసేదంతా కలసి నేను" అనీ, "నీవెక్కడ చూస్తే నేనక్కడే వున్నాను" అనీ అన్నారు.

గురువంటే అజ్ఞానాంధకారాన్ని పారద్రోలేవాడు అని అర్థం. నిరంతర బోధే గురువుయొక్క తత్వమని ఆ పదానికర్థం.

---

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

SRI MANGA BHARDWAJA TRUST

ఛీఫ్ ఎడిటర్: **శ్రీ పోలూరి శ్రీనివాసరావు** బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: **డా॥ ఆర్.ఎస్. శశిధర్,** పిహెచ్. డి

**సంపుటి: 28** **జులై 2010** **సంచిక: 3**

మనం ఒకరినుండి ఒకరు వేరు అన్న భావం బలపడడానికి ఆధునిక జీవితంలో ఒక కుటుంబంతో ఒక కుటుంబానికి ఎట్టి సంబంధాలూ లేకుండా బ్రతకడం ఒక పెద్ద కారణం. అలాకాక భక్తుల కుటుంబాలన్నీ వారానికో, పక్షానికో ఒకచోట సమావేశం కావడం, కలసి వేడుకలు, పూజాదికాలు చేసుకోవడం దీనికెంతో ఉపకరిస్తుంది. సహజమానవ ప్రవృత్తిననుసరించి కీచులాటలు, పోటీలు భేదాలు వస్తే రావచ్చు. అందుకు కారణం అంతస్తులు, కులమత భేదాలు, ఆడంబరాలు అనే దౌర్భాగ్యపు అడ్డుగోడలు హృదయాలను సంకుచితం చేయడమే. కలవారినే గౌరవించడం, లేనివారిని చిన్న చూపు చూడడంవంటి హీన వికార చేష్టలను నేటి సమాజం నూరిపోస్తుంది. వాటిలో చిక్కిన హృదయాలకు పూజలు, జపాలు, ఏమీ ఉపకరించవు. కారణం వాటి ప్రయోజనం హృదయాలను అట్టి భ్రాంతులనుండి క్షాళన చేయడమే.

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు. శ్రీ మంగభరద్వాజ ట్రస్టుకు ఎటువంటి బాధ్యతా లేదు.

## విషయసూచిక

1. భగవంతుడు గురువుగా అవతరించిన రూపం! 01
2. గురువు అనుగ్రహంలేక ఆధ్యాత్మిక సాధన సిద్ధిస్తుందా 03
3. "సద్గురువు" 06
4. శ్రీ సాయి సచ్చరిత్ర 10
5. శ్రీ దత్తలీలామృతం –సీరియల్ 13
6. వార్తాలాపము – సీరియల్ 18
7. శ్రీ భరద్వాజ లేఖామృతము 22
8. గురువును తెలుసుకోవాలి 24
9. కుండ చేసిన కుమ్మరి ! 30

**చందా వివరములు**

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10–00 |
| సంవత్సర చందా | : రూ. 100–00 |
| జీవిత చందా | : రూ. 1,116–00 |
| (సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును) | |
| (20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది) | |
| రాజపోషకులు | : రూ. 3,000–00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000–00 |

**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P,Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500 068
website: www.saibharadwaja.org

"సూర్య చంద్రాదులున్నంత వారకు నా అవతార కార్యము కొనసాగుతూనే వుంటుంది".

# గురువు అనుగ్రహంలేక ఆధ్యాత్మిక సాధన సిద్ధిస్తుందా?

- ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

టిబెట్‌లోని యాంగ్‌సా అనే ప్రాంతంలో జన్మించిన (1052 AD) మహాయోగి మిలారేపా. మిలారేపా పసితనంలోనే సంపన్నుడైన అతడి తండ్రి చనిపోతాడు. అమాయకురాలైన అతని తల్లినీ, చెల్లెలునూ, మిలారేపానూ దాయాదులు అష్టకష్టాలు పెట్టి, ఆస్థి కాజేసి యింటి నుంచి వెళ్ళగొడతారు. పగబట్టిన అతని తల్లి ప్రోద్భలంతో, మిలారేపా ఒక గురువు వద్దకు వెళ్ళి క్షుద్రవిద్యలెన్నో నేర్చుకొని వచ్చి తన శతృవులనందిరినీ దారుణంగా హతమారుస్తాడు. ఫలితంగా మిలారేపా మానసికంగా ఎంతో అశాంతికి గురియౌతాడు. క్షుద్రవిద్యలు నేర్పిన గురువు సలహాపై అతడు హీనాతిహీనమయిన జన్మల వలయంలో పడవేసే చెడ్డకర్మ నుంచి బైటపడడానికి శుభ్రమార్గం చూపగల ఆధ్యాత్మిక గురువునన్వేషిస్తూ బయలుదేరుతాడు.

చివరకు మహా తపస్సంపన్నుడూ, ప్రఖ్యాత మహాత్ముడైన నరోపా గారి శిష్యుడూ అయిన మార్పాగారిని దర్శించి, ఆయనే తనకు జ్ఞానాన్నివ్వగల సమర్ధుడని పూర్తిగా విశ్వసించి, తాను చేసిన ఘోరమైన తప్పిదాలను ఏకరువుపెట్టి, తననా అశాంతి నుంచీ, పాపకర్మ నుంచీ విడుదల చేయమని ప్రార్థించి తన మనస్సునూ, శరీరాన్ని గురువుకర్పిస్తాడు.

మార్పాగారికి కూడా మిలారూపా తన వద్దకు వస్తాడనీ, అతన్ని తాను ఉద్ధరించి మహాయోగిగా చేయవలసి వుంటుందనీ దైవాదేశంవస్తుంది. అందుచే మార్పాగారు వెంటనే అతణ్ణి శిష్యుడిగా అంగీకరిస్తాడు.

మహాజ్ఞానియైన మార్పాగారు మిలారేపా యోగిగా పరిణితిచెందేందుకు తగిన తర్ఫీదునిస్తూ, పైకిమాత్రం అతని పట్ల కఠినంగా వ్యవహరించేవారు. అనేక అంతస్థుల భవనాలను కొండరాళ్ళతో ఒక్కడినే నిర్మించమనేవారు. అలా చేశాక వాటిని పడగొట్టించి, ఎక్కడిరాళ్ళనక్కడ పడవేయించేవారు. అయితే ఎన్నిసార్లు అడిగినా ఉపదేశం మాత్రం చేసేవారు కాదు. ఏమార్గమూ బోధించేవారూకారు. ప్రతిసారి ఒక్క ఇల్లు కట్టిచ్చావంటే ఈసారి కూలద్రోయించననీ, తప్పక ఈజన్మలోనే బుద్ధత్వాన్ని ప్రసాదించగల ఉపదేశం యిస్తాననీ ప్రోత్సహించేవాడు. ఇలా కాలయాపనతో విసిగిపోయిన మిలారేపా ఒకసారి మిగతా శిష్యులతోపాటు ఉపదేశం కోసం కూర్చొని గురువుచే తీవ్రంగా దండింపబడతాడు. "ఈయన హృదయాన్ని నా సేవతో ఎన్నటికీ కరిగించలేను. ఈయన ఉపదేశమివ్వక నేను తరించను" అని దుఃఖిస్తున్న మిలారేపాను గురుపత్ని, మార్పాగారి ప్రధానశిష్యుడూ, గురువంతటి జ్ఞానీయైన గోగ్‌డన్ వద్దకు పంపుతాననీ, దుఃఖించవద్దనీ ఓదారుస్తుంది.

సత్యాన్వేషణతో తపిస్తున్న మిలారేపాకు గురుపత్ని చెప్పిన మాటలు ఆశాజ్యోతులౌతాయి. ఎవరివద్ద నుంచైనా సరే ఆ ఉపదేశం పొంది బుద్ధత్వాన్ని పొందాలని అతని కోరిక. గురుపత్నియైన దామేమా ఒకరోజు భర్తనేమార్చి, పూజామందిరంలోని మార్పాగారి గురుదేవులైన నరోపాగారి జపమాలలు మిలారేపాకిచ్చి భర్త వ్రాసినట్లుగా, "నేను త్వరలో ఏకాంతవాసానికి వెళ్తున్నాను. ఈ మంత్రగాడు ఉపదేశం పొందాలని ఆతృత పడుతూండటంవల్ల నీవద్దకు పంపుతున్నాను. నువ్వతనికి ఉపదేశమివ్వవలసినది. ఇది నా ఆజ్ఞ. అందుకు

గుర్తుగా నీకు నరోపాగారి జపమాలలు పంపుతున్నాను" అని ఉత్తరం వ్రాసి, మార్పాగారి సీలువేసి అతిరహస్యంగా పంపింది.

మిలారేపా గోగ్డన్ వద్దకు చేరిన సమయానికి ఆయన శిష్యులకు ప్రవచనం చేస్తున్నారు. ఒక గ్రంథంలోంచి ఆయన "నేను సృష్టి స్థితి లయకారకుడను. నేను గురువును. నేనే శిష్యుడను. నేనే చైతన్య రూపుడను." అనే పవిత్రవాక్యాలు చదువుతున్న సమయంలో మిలారేపా ఆయన దృష్టిలో పడ్డాడు. మిలారేపా నమస్కరించిన పద్ధతిచూచి అతడు మార్పాగారి శిష్యుడనీ, అతను పవిత్రమైన పైవాక్యాలు చదువున్న సమయంలో రావటంవల్ల ఆ శకునం యితను మహాయోగి అవుతాడనడానికి సూచన అని గ్రహించాడు గోగ్డన్. మిలారేపాతెచ్చిన ఉత్తరమూ, జపమాలలూ స్వీకరించి తప్పక ఉపదేశమిస్తానని వాగ్దానం చేశాడు.

మరునాడు లామాగోగ్డన్ మిలారేపాను పిలిచి తనదర్శనానికి వస్తున్నభక్తులనూ, శిష్యులనూ దుష్టులైన గొఱ్ఱెలకాపరులు కొందరు బాధిస్తున్నారనీ, మంత్రాలతో వారికి బుద్ధిచెప్పి వస్తే తప్పక ఉపదేశమిస్తాననీ చెప్తాడు.

"నేను క్షుద్రవిద్యలే నేర్చుకున్న ఆ రోజు ఎంత పాపిష్టిరోజు! ఈ పాపకూపం నుంచి నేను బయటపడను కాబోలు" అని నిందించుకుంటూ చేసేదేమీలేక గోగ్డన్ చెప్పిన వారందరి పోలాలపై వడగళ్ళ వానలుకురిపించి, వారందరికీ అపారనష్టం కలిగించి, వస్తూవస్తూ తానుచేసిన బీభత్సం వల్ల చనిపోయిన పక్షులనూ, ఎలుకలనూ ఒకమూటలో వేసి తీసుకొచ్చి, లామా గోగ్డన్ ముందు కుప్పవేసి, "ఇంతవరకు చేసుకున్న గొప్ప పాపాలరాశికి తోడు ఇప్పుడు మరికొంత పాపాల్ని చేర్చాను. నా పాపానికి నిష్కృతిలేదు. నామీద దయతో నన్నీ వలయం నుంచి బైటపడవేయండ"ని ఆవేదనతో దుఖించాడు. అప్పుడు లామాగోగ్డన్ ఓదార్చి, "నిరాశపడకు, నిజానికి నువ్వింత దుఃఖపడడానికి కారణమేమీలేదు. నిజానికి వీటిని నువ్వేమీ చేయలేదు. నామాట మీద విశ్వాసం లేకపోతే చూడు" అంటూ కాసేపు ధ్యానం చేసి, కళ్ళుతెరచి చప్పట్లు చరిచారు. ఎంత ఆశ్చర్యం! అప్పటిదాకా నిర్జీవంగా వున్న పక్షులు రెక్కలల్లాడిస్తూ పైకెగిరిపోయాయి. ఎలుకలు కలుగుల్లోదూరాయి! ఆ సమయంలో లామా గోగ్డన్‌లో బుద్ధత్వపు లక్షణాలను సంపూర్ణంగా చూచాడు మిలారేపా.

తర్వాత త్వరలోనే మిలారేపా ఎన్నాళ్ళుగానో కలలు కన్న ఉపదేశం లామాగోగ్డన్ మార్పాగారి ద్వారా పొందినదే మిలారేపాకిచ్చాడు. వెంటనే ఒక గుహను ఏర్పాటుచేసుకుని ఆహారం, నీరు అందించడానికి మాత్రం ఒక చిన్న కిటికీ వుంచి, లోపలవుండి మిగతా గుహద్వారాన్నంతా మూసివేసుకొని గోగ్డన్ చెప్పిన పద్ధతుల ప్రకారం సాధన చేయనారంభించాడు మిలారేపా. అయితే ఎంత శ్రద్ధగా ధ్యానం చేసినా ఏమాత్రం పురోగతి కనిపించలేదు. ఒక రోజున గోగ్డన్ వచ్చి, "నీకు 'ఫలానా' రకమైన అనుభవం వచ్చిందా?" అని అడిగాడు. అలాంటి అనుభవమేమీ రాలేదని చెప్పాడు మిలారేపా. "రాకపోవడమేమిటి? ఈ రకమైన సాధనలో పురోగతిలేకుండా వుండడం అసంభవమే! ఎక్కడో ఏదో లోపం వుండి వుండాలి! ఏమై ఉంటుందబ్బా! గురుదేవులు మార్పగారి అనుమతి లేదనుకుందామా అంటే జపమాలలూ, ఉత్తరం కూడా పంపారాయె! సరే! కొన్నాళ్ళు ధ్యానం కొనసాగించు

– చూద్దాం" అన్నారు.

అప్పుడు మిలారేపాకు అర్థమైంది – లోపం ఎక్కడుందో, గోగ్డన్ ముందు గురువు ఆజ్ఞలేదనే సత్యాన్ని బైటకు కక్కబోయి, అంత ధైర్యంలేక ఎలాగో అణచుకొన్నాడు మిలారేపా. ఇప్పుడిక గురుదేవులైన మార్పాగారిని శరణుపొందటం తప్ప మరో మార్గంలేదు. ఆ అవకాశం వచ్చేదాకా ఆ గుహలోనే ధ్యానం కొనసాగించాడు మిలారేపా.

ఇంతలో మార్పాగారు మిలారేపా పూర్తిచేయకుండా వదిలేసివెళ్ళిన యింటికి కప్పు వేయించడానికి కావలసిన కలపను సేకరించి పంపమని గోగ్డన్‌కు ఉత్తరం వ్రాస్తూ చివర, "త్వరలో జరిగే నా కుమారుని ఉపనయానికి తప్పక హాజరు కావలసినది. నీతో గనుక ఆ మంత్రగాడు (మిలారేపా) వుంటే వాడిని తప్పక తీసుకురా" అని వ్రాశారు.

ఆ ఉత్తరం చూడగానే లామాగోగ్డన్ నేరుగా మిలారేపా వద్దకు వచ్చి, ఉత్తరం చదివి వినిపించి, "దీనిని బట్టి ఉపదేశం పొందడానికి నీవు గురువు అనుమతి పొందకుండానే వచ్చినట్లున్నదే" అని అడిగాడు. తాను గురువుకు తెలియకుండానే వచ్చాననీ, తాను తెచ్చిన ఉత్తరం గురుపత్ని సృష్టించిన నకిలీ వుత్తరమనీ, ఆ మాలలు కూడా భర్తకు తెలియకుండా ఆమే యిచ్చిందనీ – చెప్పాడు మిలారేపా. "అందుకే మామూలుగా సాధనలో అందరికీ వచ్చే అనుభవం నీకురాలేదు. ఇంతకాలం నువ్వుచేసిన సాధన అంతా వ్యర్థం. గురువు యొక్క అనుమతిలేకుండా చేసే ఆధ్యాత్మిక సాధనలు ఫలించవని నీకు తెలియదా?" అంటూ ప్రయాణానికి సిద్ధం కమ్మని చెప్పాడు. గురుపత్ని దామేమా, "నీ గురువు ఇప్పుడు నీకు ఉపదేశమివ్వడానికి సుముఖంగా వున్నారు. నువ్వు తప్పక రావలసినది." అని రహస్య వర్తమానం పంపడంతో తన చిన్న గుహలో ఆనందపు చిందులు వేశాడు మిలారేపా.

త్వరలోనే మిలారేపా తిరిగి గురువు సన్నిధికి చేరి ఆయన యిచ్చిన శిక్షణతో సాధన చేసి మహాయోగియైనాడు. గురుకృప ఎంత విలువైనది!

---

చదవండి! **టిబెట్ యోగి మిలారేపా** చదివించండి!!

**రచన: ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

వెల : రూ|| 40–00 లు

ప్రతులు:– **శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్,**

c/o, **Sri Manga Bharadwaja Trust,**

Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,

Jaipuri Colony, Nagole, Hyderabad - 68

Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**

# సద్గురువు

"సాయి మాస్టర్ ప్రవచనాలు" అనే గ్రంథం నుంచి

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

**గురుమధ్యే స్థితం విశ్వం, విశ్వమధ్యే స్థితోగురుః।**

**గురుర్విశ్వం నచాన్యోస్తి, తస్మైశ్రీ గురువే నమః॥**

గురువే విశ్వం. గురువుకన్యంగా మరొకటి లేదు. అంటే గురువు అంతటి గొప్ప మహనీయుడన్నది సుస్పష్టం. అటువంటి గురువు సకల దేవతా స్వరూపి. బాగా అవగాహన చేసుకుంటూపోయేవారికి ఈ చరాచర విశ్వమంతా గురువు యొక్క స్వరూపమే. అంతకు భిన్నంగా మరొకటి లేదు. ఈ శ్లోకం వల్ల తెలిసేదేమిటంటే - ఈ చరాచర విశ్వమంతా తమ రూపమేనని ఎవరైతే నిరూపణ యివ్వగలరో వారే నిజమైన, సిసలైన, సంపూర్ణమైన గురువు అని.

ఉదాహరణకు శ్రీ కృష్ణుడు జగద్గురువుగా, యోగీశ్వరుడిగా, గీతా చార్యుడుగా లోకంలో ఇంతటి కీర్తి గడించడానికి కారణం భగవద్గీతోపదేశం కాదు. ఎందుకంటే అదే భగవద్గీతను అనేకసార్లు చదివినటువంటి మామూలు వ్యక్తి కూడా శ్రీ కృష్ణుడు చెప్పినంత గొప్పగానూ ఉపన్యాసం ఇవ్వగలడు. కానీ, మామూలు వ్యక్తి చేయలేని పని ఒకటుంది అదే విశ్వరూపం సందర్శనం. శ్రీ కృష్ణుడు అర్జునునికి విశ్వరూప సందర్శనం కలిగించాడు. తాను చెప్పినదంతా నిజమని నిరూపించాడు. ఆ పని మామూలు వ్యక్తి ఎలా చేయగలడు? తాను చెప్పినది నిజమని అర్జునుడికి అనుభవపూర్వకంగా నిదర్శనమిచ్చాడు శ్రీ కృష్ణుడు. ఈ సృష్టి అంతా తన రూపమేనని చెప్పాడు. అప్పటిదాకా శ్రీకృష్ణుడు ఎంతగా చెప్పినా, 'ఏమిటబ్బా! ఇట్లా చెప్పాడీయన' అని అర్జునుడికి అనిపిస్తుంది. కానీ, విశ్వరూప సందర్శనమయ్యేసరికి అర్జునునికి అప్పటివరకు తాను చెప్పిన విషయాలు మొత్తం (అంటే విశ్వరూప సందర్శనం ఇచ్చేటప్పటికి ఎన్ని అధ్యాయాలు గీతలో వున్నాయో అన్నీ) సమన్వయమై, అనుభవమై, దర్శనమయ్యాయి. అదే కృష్ణుని యొక్క గొప్పతనం. అందువలననే ఆ విషయంలో శ్రీ కృష్ణునికి సాటి ఎవరూ లేదు. మరలా అదే విషయం అంత సంపూర్ణంగానూ పామరులైన మానవులకు గూడా ఈ విశ్వమంతా తన రూపమేనని అనుభవపూర్వకంగా నిరూపించిన వారు శ్రీ శిరిడీ సాయి నాథుడు.

ఎంతో మంది మహాత్ములు వచ్చారు, పోయారు. ఇందులో ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ, అన్నది ప్రశ్నకాదు. కాని మనకు అనుభవపూర్వకంగా నిరూపించడంవల్ల మార్గం సులభమవుతుంది. మన మనస్సు తేలిక అవుతుంది. ఏ మహాత్ముడైనా, శ్రీ కృష్ణుడైనా, ఏ దైవమైనా చెప్పేది ఒక్కటే. "క్షణకాలమైనా విడవకుండా ఎల్లప్పడూ మనసులో నన్నే చింతన చేస్తూ వుండండి. గుర్తు పెట్టుకోండి. మీ క్షేమ సమాచారాలన్నీ నేను కనిపెడుతుంటాను," అనే. భక్తుల యోగక్షేమములు వహిస్తానని శ్రీ కృష్ణుడు చెప్పాడు. అది సాయిగూడ చెప్పారు. ఎంతమంది మహనీయులు వచ్చారో, అంతమందీ ఇదే మాట చెప్పారు. ఎంత మంది చెప్పినా ఒకటి మాత్రం మనవల్లకాదు. అదేమిటంటే అంతా ఆయన రూపమేనని అనుకోవడం. కుక్క కుక్కగా కనపడుతుంటే, మనిషి మనిషిగా కనపడుతుంటే, వీళ్ళంతా ఆయన రూపమేనని అనుకోవడం ఎట్లా? పక్కవారి మీద మనకు ఆగ్రహం వస్తుంది, అనుగ్రహమూ వస్తుంది. కోపము, అసూయ, ద్వేషం, భయము

మొదలైనవన్నీ వస్తుంటాయి. కానీ, ఇవన్నీ కల్గించేటటువంటి మానవాకృతులన్నీ పరమేశ్వరుని రూపమని అనుకోవడమెట్లా? ఇంట్లో నిశ్చలంగా కూర్చొని భగవంతుని కోసం ధ్యానం చేస్తూవుంటే ఎంతో ప్రయత్నంమీద ఆ ధ్యాన మందిరంలో కూర్చొన్నంత సేపు భగవంతుడి మీద మనస్సు నిలిస్తే నిలిచి యుండుగాక, కానీ ఎల్లప్పడూ నిలవదు. ఉదాహరణకు ఒకడు ఆ ప్రయత్నం చేస్తూవుంటే (అంతా భగవత్స్వరూపమేనని) ఇంట్లోని పిల్లవాడు వచ్చి విపరీతంగా అల్లరి చేశాడనుకోండి. వాడిమీద కోపం వచ్చి వాడిని చావబాదాడనుకోండి. అప్పడు ఏమయిందన్నమాట? అంతకుముందు వరకు తను చేసే ధ్యానంలో అతడు ఈ ప్రపంచంలోవున్న నామరూపాలన్నీ నీవేనయ్యా! అని నమస్కారం చేసుకొన్నాడు. వెంటనే ఆ పిల్లవాడిని పట్టుకుని చావబాదాడు. అప్పడు ఎవర్ని పట్టుకొని చావబాదినట్లు? ఒకవేళ బాదకపోయినా, తీవ్రమైన ఆగ్రహం వచ్చి 'ఈ ఇల్లు నరకంరా!' అన్నాడనుకోండి. అప్పడు ఏమయింది? ఏ పరాత్పరుడు తన చుట్టూ ఉన్నాడో, అన్ని రూపాలలోనూ ఉన్నాడో అదే వీడికి నరకమయింది. అంటే జగత్తు రూపంలో బ్రహ్మము ఉంది. "సర్వం ఖల్విదం బ్రహ్మ" కానీ మనస్సులో నరకమే ఉన్నదని అర్థం. చూడగలిగే వాళ్ళకి అదే భగవత్స్వరూపం. చూడలేని వారికి అదే మామూలు గృహం. చికాకులో వుండేవారికి అదే నరకం. మన దృష్టిని బట్టే అంతావుంది. కాబట్టి మనదృష్టిమారాలి. పూజా గృహాలలో నుంచి ఇవతలకు రాగానే నిత్యజీవితంలో అవతలవారి పనులవల్ల, మాటలవల్ల రాగద్వేషాలు ప్రకోపిస్తాయి. అందుకని మనం గుర్తుపెట్టుకోవడం కోసం మనం చేసే ప్రయత్నం, వెంటనే ఎగిరిపోతుంది. వాడిట్లా చేశాడు. వీడిట్లా అన్నాడు అని,యిదే జాబితా చదువుతుంది మనస్సు. మనం ఇంక దైవాన్ని గుర్తుపెట్టుకొనేది ఎక్కడ? కనుక ఇది మానవజాతికి అంత సులభం కాదు. అంత తేలికగా రాదు. ఇది మామూలు మానవులకే గాదు. గొప్పగొప్ప ఋషీశ్వరులకు గూడ చాలా కష్టమయిన విషయం. ఆ ఋషీశ్వరులు మామూలు కార్యక్రమాలన్నింటినీ మానుకొని అరణ్యాలలో వుంటూ ఘోరతపస్సు చేసుకొంటూ అంతర్ముఖులై వుంటారు. ఎంతో ధ్యాన నిష్ఠతో, తపస్సుతోపైకి వచ్చిన మహనీయులు కూడా ఏ కారణం చేతనైనా ఆ తపస్సులోంచి లేచి ఇవతలకు వచ్చిన క్షణాలలో వారి మనస్సు చంచలమవుతున్నది, ప్రక్కకే పోతున్నది. ఒకరికి కామంవల్ల కావచ్చు, మరొకరికి మరొక కారణం కావచ్చు. ఆయా పనులద్వారా వారి తపస్సు వ్యర్థమయిపోయి మరలా తపస్సు చేసుకోవడమనే కర్మ పట్టడం మన పురాణాలలో చెప్పబడ్డది. ఒక ఋషీశ్వరుడు తపస్సు చేసుకొంటున్నాడు. ఎవరో ఏదో చేశారు. వారికి ఆగ్రహం వచ్చింది. "ఒరేయ్ నీవిట్లా అయిపో!" అని శాపం పెట్టాడు. ఆ శాపం రూపంలో, ఆగ్రహరూపంలో వాడికి పతనం వస్తుంది. అప్పడు అవతలివాడికి కూడా కొద్దో గొప్పో సామర్థ్యం వుంటే వాడి తపస్సుతో వాడూ శాపం పెట్టాడు. అప్పడు ఏమయిందన్నమాట? వాడి శాపం తీరేదాక వీడా శాపఫలాన్ని అనుభవించవలసిందే. అప్పడు ఇంతకుముందు చేసిన తపస్సంతా వ్యర్థమయిపోయినట్లే గదా!

ఇదంతా ఎందుకు చెప్పానంటే, అంతటి మహాత్ములకే, తపస్వులకే అంతర్ముఖులై నిశ్చలంగా అదే నిష్ఠలో ఉండడం సాధ్యపడలేదు. కాసేపు తెరిపి కోసం బయటికొస్తే ఆ కాసేపటిలోనే బోల్తాకొట్టి పోయినవాడే వున్నాడు. తపస్సు భగ్నమైన వాళ్ళూ వున్నారు. అది అంతటి కష్టమైన పని. అది ఋషీశ్వరులకే సాధ్యపడలేదంటే

ఇంక మనం ఎంత జాగ్రత్తగా వుండాలో తెలుసుకోవాలి.

ఉదాహరణకు ఒకరోజు ఒక భక్తురాలు బాబా వద్దకు వచ్చి బాబాను తన యింటకి భోజనానికి రమ్మంది. "అలాగే తల్లీ! తప్పకుండా వస్తాను. భోజనం కూడా చేస్తాను. కాని నేను వస్తే మాత్రం ఛీ కొట్టి తరిమేయకు సుమా!" అని అన్నారు బాబా. బాబా! "నేను మిమ్మల్నిలా యెందుకు చేస్తాను? మీరు తప్పక రావాలి" అని ప్రార్థించి ఆమె ఇంటికి వెళ్ళింది. బాబాకు ఆతిధ్యమివ్వడానికి వంటకాలను సిద్ధం చేసి బాబా కోసం ఎదురు చూస్తూకూర్చుంది. భోజన సమయం దాటిపోతున్నా బాబా మాత్రం రాలేదు. కానీ ఒక కుక్కవచ్చి బాబా కోసం వండి వడ్డించడానికి సిద్దంగా వున్న వంటకాలను ముట్టుకోబోయింది. అది చూచిన ఆమె పొయ్యిలోవున్న కట్టెనుతీసి ఆ కుక్కపైకి విసిరింది. ఆ కుక్క తప్పించుకొని వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఆమె చాలాసేపు బాబాకోసం వేచి చూచిందిగాని బాబా రాలేదు. తర్వాత ఎంతో బాధగా మశీదుకు వెళ్ళి బాబా తన యింటికి భిక్షకు రానందుకు నిష్ఠూరమాడింది. అప్పడు బాబా ఆమెతో, "నేను వస్తే మండుతున్నకట్టె వాపై విసిరావు గదమ్మా! నువ్వే నన్ను గుర్తుపట్టలేదు. సర్వజీవుల రూపాలలో నేనువున్నానని గుర్తుంచుకో" అని చెప్పారు.

అలాగే హంసరాజ్ అనేవాడు చాలాకాలంగా ఉబ్బసవ్యాధితో బాధపడుతుండేవాడు. ఎన్ని వైద్యాలు చేసినా తగ్గక పోయేసరికి బాబా దగ్గరకు వచ్చి శిరిడీలోనే కొంతకాలమున్నాడు. అతనిని బాబా పుల్లపెరుగు తినవద్దన్నారు. కానీ అతడికి పుల్ల పెరుగుంటే చాలా ఇష్టం. అందుకని బాబా తినవద్దన్నా కూడా భార్యచేత బలవంతాన తోడు పెట్టించుకొని తినేవాడు. కానీ సర్వజ్ఞుడైన బాబాకు తెలియనిదేమున్నది? బాబా చిత్రమైన లీల చేశారు. ప్రతిరోజూ ఆ దంపతులు మశీదులో మధ్యాహ్నహారతికి హాజరయ్యేవారు. వారు అక్కడకు వచ్చిన సమయంలో ప్రతిరోజు వీళ్ళ రూములోకి ఒక పిల్లి వచ్చి పెరుగు తినిపోయేది. మొదటి రోజలా జరిగేసరికి పొరపాటు అనుకొని అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. కాని అదేమి చిత్రమో వీరెన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఆ పిల్లి రావడం, పెరుగుతినిపోవడం ప్రతిరోజూ జరుగుతూనే వుంది. చివరకు అతనికి విసుగుపుట్టి, కోపం వచ్చి హారతికి గూడ పోకుండా దాన్నెలాగైనా రాకుండా చూడాలని, వస్తే కొట్టాలనీ నిర్ణయించుకొని ఒక కర్ర చేత్తో పట్టుకొని కాపలా కూర్చున్నాడు. సరిగా సమయానికి ఆ పిల్లి రానే వచ్చింది. "రోజూ పెరుగుతిని పోతావా"? అని అతడు దానిని కర్రతో కొట్టాడు. తర్వాత అతడు మశీదుకు రాగానే బాబా అన్నారు: "ఇక్కడొక పనికిమాలినవాడు ఉబ్బసంతో బాధపడుతున్నాడు. వాడికి పుల్లపెరుగు తినవద్దని చెప్పాను. ఎంత చెప్పినా వినకుండా అతడు తింటూనే వుంటే నేనే పిల్లి రూపంలో వెళ్ళి తిని, అతడా పెరుగు తినకుండా చూస్తున్నాను. చివరకు వాడు నన్నీరోజు కర్రతో కొట్టాడు" అన్నారు.

అలాగే బల్వంత్ నాచ్నే అన్నగారు బొంబాయిలో శస్త్రచికిత్సకని ఆస్పత్రిలో వున్న సమయంలో వాళ్ళింటికి ఒక సాధువు వచ్చి భిక్ష అడిగాడు. అతని వదినగారు అన్నం పెట్టింది. ఇంట్లో బెండకాయకూర వుందిగానీ అది అందరూ తినగా మిగిలినది కదా! అని ఆయనకు వెయ్యలేదు. వేరే కూర వేసింది. కానీ ఆ సాధువు ఆ కూరే అడిగి వేయించుకొని మరీ తిన్నాడు. ఆ తర్వాత 4 సం॥ల తర్వాత అతడు శిరిడీ

మొట్టమొదటసారి వెళ్ళినప్పడు బాబా ఆ సాధువు తానేనని అతనికి తెల్పారు. ఇలాంటి ఎన్నో సంఘటనల ద్వారా ఏ సాధువుకు పెట్టినా తనకే చెందుతుందని, ఏ ప్రాణిని ఆదరించినా, హింసించినా తనకే చెందుతుందనీ నిరూపించారు బాబా.

ఏ దైవానికైనా మ్రొక్కుకొని ఆ మ్రొక్కు ఎగ్గొడితే వాళ్ళు రాగానే వాళ్ళు మ్రొక్కుకున్నంత డబ్బు అడిగి పుచ్చుకునేవారు. అలాగని ప్రక్కవాడు డబ్బులిస్తే తీసుకునేవారు కాదు. "ఏమయ్యా! వాడిస్తే తీసుకొంటివి, వీడిస్తే తీసుకోలేదేమని అడిగితే "వాడు మ్రొక్కుకొని ఎగ్గొడితే అడిగి తీసుకున్నాను. వీడు మ్రొక్కుకోలేదు గనుక వీడి దగ్గర తీసుకోలేదు" అనేవారు. కాబట్టి ఏ దేవతకర్పించినా తనకే చెందిందని, చివరకు మానవమాత్రుణ్ణి గూడ ఏ విధంగా చూచుకున్నాగూడ అది ఆయనకే చెందిందని భక్తులకు అసంఖ్యాకంగా అటువంటి అనుభూతులను యిస్తూనే వచ్చారు. అంతటా అన్ని రూపాలలో వ్యాపించి వున్నవాడు అంతటా వున్నాడుగనుక ఎప్పడూ ఆయనకు అన్నీ తెలుస్తూనే వుంటాయి. కారణం అన్ని రూపాలలో ఆయనే వున్నారు గనుక.

ఉదాహరణకు చంద్రాబాయి బోర్కర్ అనుభక్తురాలు శిరిడీలో కొంత కాలమున్నారు. అప్పడామె భర్త పండరీపురంలో వున్నాడు. ఒకరోజు బాబా ఆమెతో పండరిపురంలోని ఆమె భర్తవద్దకు వెళ్ళమని చెప్పారు. ఆమె వెంబడే తానుంటానని గూడ చెప్పారు. కాని ఆమె అక్కడకు వెళ్ళేసరికి ఆయనక్కడ లేరు. ఎక్కడికి వెళ్ళారో గూడ తెలియలేదు. ఏమి చేయాలో తోచని పరిస్థితులలో ఆమె వుండగా, ఒక ఫకీరు ఆమె వద్దకు వచ్చి, మీవారు ధోండ్ స్టేషన్‌లో వున్నారు. వెంటనే వెళ్ళమని చెప్పి టికెట్టు గూడ యిచ్చారు. అంతేగాక ఆమె భర్తకుగూడ కలలో ఒక ఫకీరు కన్పించి నీ భార్య ఫలానా రైలులో వస్తున్నదని చెప్పారు. తర్వాత ఆ ఫకీరు సాయిబాబానేనని వాళ్ళు తెలుసుకున్నారు.

బాబా ఆదేశం ప్రకారం ఖండోబా ఆలయంలో వున్న ఉపాసనీ బాబా, బాబాకు నైవేద్యమిచ్చిన తరువాత తను భోజనం చేసేవారు. ఒకరోజు ఉపాసనీ ఆ నైవేద్యాన్ని తీసుకొనిపోతూ వున్నప్పడు ఒక నల్లకుక్క తోకాడిస్తూ వెంట పడింది. దీనికి పెట్టిన తరువాత బాబాకు నైవేద్యం పెట్టడం ఎట్లాగా అని దానిని ఛీ కొడుతూ, కసిరికొడుతూ మసీదుకు వెళ్ళారు. వీరు మసీదుకు వెళ్ళి బాబాకు నైవేద్యం యివ్వబోతే, "ఇక్కడికెందుకు తీసుకువచ్చావు? నేనక్కడ నల్లకుక్క రూపంలో వున్నాను గదా!" అన్నారు బాబా. కాబట్టి యిక నుండి గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నిద్దామని అనుకొన్నాడు. అంతగా ప్రయత్నించినప్పటికీ, అంత జాగ్రత్తగా వుంటున్నప్పటికీ మరలా ఏమారాడతను. ఒకరోజు యితను వంట చేసుకుంటుంటే బిచ్చమెత్తుకునే వాడొకడు ఆశగా నిలబడి దానివైపు చూసున్నాడు. నైవేద్యం పెట్టకముందే యితడు చూస్తున్నాడు కాబట్టి అది అపవిత్రమౌతుందని తలచి అతనిని కసిరికొట్టాడు. నైవేద్యం మసీదుకు తీసుకెళ్ళగానే మరలా బాబా కోప్పడ్డారు. "ఇప్పటినుండి గుర్తు పెట్టుకో. ఎక్కడ నీ దృష్టి పడుతుందో, అక్కడ నేనున్నా" నని చెప్పారు బాబా. ఈ విధంగా సకలచరాచర విశ్వమంతా తమ రూపమేనని నిరూపించిన శ్రీసాయిబాబా సమర్థ సద్గురువు.



# శ్రీ సాయి సచ్చరిత్ర



మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు
స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

June సంచిక తరువాయి
అధ్యాయం - 50

శ్రీ గణేశాయ నమః, శ్రీ సరస్వత్యై నమః, శ్రీ గురుభ్యోన్నమః,
శ్రీ కులదేవతాయై నమః శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః శ్రీ సద్గురు సాయినాథాయ నమః



"తద్విద్ధి ప్రణిపాతేన । పరిప్రశ్నేన సేవయా ॥
ఉపదేక్ష్యంతి తేజ్ఞానం । జానినస్తత్త్వ దర్శినః ॥

ఇది భగవద్గీతలోని మూల శ్లోకం. ఇందులోని మూడవ పాదాన్ని గమనించండి 'జ్ఞానం' అన్న పదానికి ముందు అవగ్రహ చిహ్నం (2) వుంచితే (తే2జ్ఞానం) అజ్ఞానం అన్న పదాన్ని సూచిస్తుంది (67) అవగ్రహాన్ని గనుక వుంచకపోతే అది నిస్సందేహంగా జ్ఞానం అన్న పదం. దానికి విరుద్ధంగా ఎవరూ చెప్పరు. ఈ అర్థం అందరూ తీసుకున్న విషయమే (68). 'జ్ఞానాదేవతు కైవల్యం' - 'జ్ఞానం వలననే కైవల్యం ప్రాప్తిస్తుంది' - ఈ శృతి వాక్యాన్ని అందరూ అంగీకరిస్తారు. అయినా తత్త్వజ్ఞులు జ్ఞానాన్నే ఉపదేశించవలసిన అవసరం లేదు (69). 'నేను ఆత్మను', 'కేవలం సాక్షే భూతుణ్ణి' 'శుద్ధ ముక్తుణ్ణి', 'సర్వమూ తెలిసిన వాడిని', 'సర్వ ప్రాణులలోనూ వుండే శుద్ధ చైతన్యాన్ని నేనే', 'అద్వైతానందంలో సంపూర్ణంగా వున్నాను' (70), 'నేను అజ్ఞానాన్ని కాను', అజ్ఞానంతో చేయబడే కర్మలు గూడ నావి కావు', 'అయమాత్మా బ్రహ్మ - నేనే ఆత్మను' 'ప్రజ్ఞానం ఆనందం నేనే' (71) 'అహం బ్రహ్మాస్మి' - 'నేనే బ్రహ్మను' - ఇదే శుద్ధమైన విద్య అని తెలుసుకోవాలి 'నేను పాపిని', అభాగ్యుడను, దీనుడను' అనుకోవడమే అవిద్య అంటే. అదే అజ్ఞానం (72). 'విద్య-అవిద్య' - ఇవి రెండూ మాయ యొక్క మూల శక్తులు. మొదటిదైన అజ్ఞానం వల్ల బంధం ఏర్పడుతుంది. రెండవదానివల్ల బంధవిముక్తి లభిస్తుంది. ఇవి జీవునికి అనాదిగా వస్తున్నవి (73). నామ రూపాలతో వున్న ఈ జగత్తంతా మాయయే. ఈ మాయను గూర్చి వర్ణించడం కష్టం. ఈ మాయను అతిక్రమించడం అతి దుర్లభం (74). ఎక్కడ నుండి కల్పనలు స్ఫురిస్తాయో అదే మాయ యొక్క స్థానం. బంధము, ముక్తి - ఈ రెండూ గూడ కల్పనలోనుంచే ఉత్పన్నమవుతాయి (75). జ్ఞానాదేవతుకైవల్యం అనే శృతి వాక్యం పరమ సత్యం. కర్మలు నశిస్తేగానీ జ్ఞానం కలుగదు (76). జ్ఞానికి సంకల్ప-వికల్పాలు రెండూ వుండవు. అతనిని మాయ బంధించలేదు. అందుకని జ్ఞానికి వికారాలకు తావుండదు (77). శుక మహర్షి పరమజ్ఞాని. అయినప్పటికీ అతనికి గూడ సంశయం కలిగింది. అందువలన అజ్ఞానం కలిగింది. గురువు వల్ల తప్ప అజ్ఞానం

తొలగదు (78). జ్ఞానికి సందేశం కలిగినట్లయితే అహంకారం ఉద్భవిస్తుంది. పాలు నిండుగా వున్న పాత్రలో ఒక్క పులుపు చుక్క పడితే చాలు, పాలన్నీ విరిగిపోతాయి (79). అందువలన మొదటగా అజ్ఞానాన్ని గూర్చి తెలుసుకోవాలి. దానిని తొలగించుకుంటే మనసు నిర్మలమవుతుంది. జ్ఞానోదయమవుతుంది. అభేద సమాధి స్థితి లభిస్తుంది (80). ఎవరి యొక్క ధ్యాస నిరంతరం ధనము, వైభవాల పట్ల ఆసక్తి కలిగివుంటుందో, ఎంత అనుభవించినా విషయ సుఖాల పట్ల ఎవని యొక్క మనస్సు తృప్తి చెందదో, ఎవనికి భార్యాబిడ్డలపట్ల మోహం వుంటుందో, అట్టివాని యొక్క జ్ఞానం అజ్ఞానమేనని గ్రహించాలి (81). ఈ విధంగా ధనమందు, భార్యాబిడ్డలయందు మోహం కలవారు ఎంతటివారైనా సరే, వారు తరించడం సాధ్యపడదు (82).

ప్రపంచంలోని జీవ సముదాయమంతా అజ్ఞానంతో నిండి వున్నది. ఈ అజ్ఞానం నుండి విముక్తులై జ్ఞానాన్ని పొంది పరబ్రహ్మ స్వరూపులవ్వాలి, అంటే ముక్తి పొందాలి (83). అజ్ఞానం నశిస్తే జ్ఞానం ప్రకటమవుతుంది. జ్ఞాని క్షమాశీలి. దేహాభిమానం పోనంతవరకు మనిషి మాయధీనుడే (84). రామకృష్ణాది అవతార పురుషులకు, సనక సనందనాది శ్రేష్ఠులకూ మాయ వారి ఆజ్ఞానుసారం ప్రవర్తించే దాసి, కానీ ఇతర జీవులన్నింటినీ అది తన అధీనంలో వుంచుకుంటుంది (85). పరమాత్మ సర్వ ప్రాణులలోనూ వున్నాడు. కానీ ఈ మాయశక్తి వలన ఈ గుర్తింపు ఎవరికీ వుండదు (86). కాబట్టి 'నేనే కర్తను', 'నేనే భోక్తను అన్న అహంకారాన్ని వదలనిదే హృదయగతుడైనా పరమాత్మను శరణు వేడనిదే ముక్తి లభించదు (87). అందుకని నిత్యానితయ వివేచన, శ్రవణ మనన నిధిధ్యాసలను చేయాలి. శమదమాది షట్ సంపత్తిని సంపాదించుకోవాలి. అప్పుడే అజ్ఞానం నశిస్తుంది (88). ఈ జగత్తంతా నాకంటె భిన్నమని, నేను పరిమితుడనని, పరిచ్ఛిన్నుడనని, నేను ఈ దేహమేననీ భావించడమే అజ్ఞానం (89). జ్ఞానాన్ని ప్రతిపాదించే వేద శాస్త్రాలలో పరమదయాళువైన భాష్యకారులు అనుబంధ చతుష్టయాన్ని విస్తారంగా వివరించారు (90). వాటిలో 'అధికారి', 'విషయము', 'సంబంధము' అనేవి మూడు. నాలుగవది 'ప్రయోజనం'. ప్రయోజనం యొక్క వివేచనతో అజ్ఞానం నశించే మార్గం తెలుస్తుంది (91). జీవ-బ్రహ్మల యొక్క ఐక్యతే వేదాంతంలోని ముఖ్య 'విషయము'. ఈ ఐక్యప్రమేయాంతర్గతమై అజ్ఞానం ఏదైతే వుంటుందో దాని యొక్క నాశనమే 'ప్రయోజనం' (92). ఆ మూల అజ్ఞానాన్ని నశింపజేయడమే స్వస్వరూపానంద ప్రాప్తి. కనుక యుక్తి, ప్రయుక్తులతో అజ్ఞానాన్ని నశింపజేయాలి (93). ఎవనికి భేదభావం నశించదో అతడు జ్ఞాని కాలేడు. దేహాభిమానికి వుండేది అజ్ఞానమే (94). ఎవరైతే నిషిద్ధ కర్మలను ఆచరిస్తూ స్వయంగా తనను తాను జ్ఞానిగా చెప్పుకుంటాడో, అతని జ్ఞానం నిరసింపదగినది. అట్టివాడు నిద్రిస్తున్న కుంభకర్ణుడే (95). ఎవడైతే వేద శాస్త్రాలలో చెప్పినట్లుగాక విరుద్ధంగా ప్రవర్తిస్తాడో, వర్ణాశ్రమ నియమాలను పాటించడో, వాని యొక్క అజ్ఞానం చిత్తశుద్ధితో గాని తొలగదు. అవిద్యానిర్మూలన మొక్కటే చిత్తశుద్ధికి సాధనము (96). సత్త్వరజస్తమోగుణాలు, శబ్ద రూపరస గంగాధి విషయ వికారాలూ, జిహ్వాది ఇంద్రియాలు - వీని వలన బ్రహ్మాది దేవతలందరూ మోసగింపబడ్డారు (97). జగత్తులోని సర్వ జంగమ ప్రాణులూ అవిద్య మరియు మాయలతో పరివేష్ఠించబడి వుంటాయి. రాగద్వేషాది వికారాలలో

చిక్కుబడ్డ సర్వం అజ్ఞానంతో ఆవరించబడి వుంటుంది (98). జీవుడు అజ్ఞానంతో బంధింపబడి వుంటాడు. అతని యొక్క శుద్ధ (ఆత్మ) స్వరూపం ప్రకటమవడానికి అజ్ఞానం, కోరికలు, మరియు కర్మబంధాలు – అన్నీ తొలగిపోవాలి (99). ఆవు పొదుగునుండి పాలు వస్తుంటాయి. అక్కడే పొదుగును పట్టుకుని జోరీగలు వుంటాయి. ఈ పొదుగునుండి పాలను త్రాగవు. రక్తాన్నే పీలుస్తాయి. వాటికి రక్తమంటే ప్రీతి గనుక పాలపట్ల ప్రీతి వుండదు (100).

కప్ప, తుమ్మెద–రెండూ పద్మం చెంతనే వుంటాయి. కానీ భ్రమరం పద్మంలోని సుగంధభరితమైన పుప్పొడి చెంత వుంటుంది. కప్ప బురద నాశ్రయిస్తుంది (101) అలాగే జ్ఞానం రాశులు రాశులుగా కనిపిస్తున్నప్పటికీ మూర్ఖుడు అజ్ఞానంవైపే మ్రొగ్గుతాడు. అతనికి అజ్ఞానమే జ్ఞానమనిపిస్తుంది. అట్టి వానికి జ్ఞానం గూర్చి ఎంత వివరించినా ఏమి ఉపయోగం? (102). అజ్ఞానం నిర్మూలనమైతే జ్ఞానం దానికదే స్వయంగా ప్రకటమవుతుంది. అందుకనే ముందుగా అజ్ఞానం యొక్క ప్రతిపాదన చేయడమే ఆవశ్యకత (103). ముల్లోకాలలోనూ బ్రహ్మజ్ఞానంతో సమానమైనది మరొకటి లేదు. దానిని గూర్చిన బోధ అత్యంత మహత్వపూర్ణమైనది. అదిలేని జీవితం నిరర్థకం (104). ఇంద్రియ గోచరమయ్యే వాటన్నింటిలో బ్రహ్మమే వున్నది. విశ్వానికి మూలమంతా బ్రహ్మమే, అంటే ఆత్మయే, అది లయమవదు. ఆకారాలు మాత్రమే లయమవుతాయి. కుండను పగులగొడితే కుండ ఆకారం పోతుంది. కుండ పెంకులు మిగిలి, కుండ అస్తిత్వాన్ని తెలుపుతాయి. కుండ ఆకారం ధ్వంసం అయినా దాని అస్తిత్వపు అంశ మిగిలి వుంటుంది. ఏది నశించినా దాని పర్యవసానం సూక్ష్మ రూపంలో వుంటుంది. దీనికి ప్రమాణం సద్బుద్ధి. సద్బుద్ధి సత్యపు అస్తిత్వాన్ని తెలుపుతుంది (105–113).

సర్వపుణ్యతీర్థాలూ, వ్రతాలూ మొదలగునవన్నీ పావనమైనవే. కానీ వాటన్నింటికంటె పరమపావనమైనది బ్రహ్మజ్ఞానం. బ్రహ్మజ్ఞానానికి దారితీయని పూజలు వ్రతాలు, భజనలు నిరర్థకాలు (114). అజ్ఞానం వలన చిత్తం మలినమవుతుంది. చిత్తం యొక్క మలినాన్ని భక్తి మాత్రమే శుద్ధి చేయగలదు. భక్తి లేనిదే జ్ఞానం అసాధ్యం (115). అందువలన ముందుగా అజ్ఞానం అంటే ఏమిటో తెలుసుకోవాలి. దాని యొక్క స్వరూప స్వభావాలను తెలుసుకోవాలి. అప్పుడే అజ్ఞానం నుండి విముక్తి సాధ్యమవుతుంది. ఇందుకు భక్తియే సాధనము (116). ఎదురుకాళ్ళతో పుట్టినవాడికి కళ్ళల్లో అంజనం వేస్తే భూమిలో నిక్షిప్తమై వున్న ధనం కనిపిస్తుంది. అదే విధంగా భక్తిని ఆశ్రయించినట్లయితే అజ్ఞానం నశించి జ్ఞానోదయం కలుగుతుంది (117). జ్ఞానం అంటే ఆత్మ స్వరూప ప్రాప్తి. దానికి కావలసినది అజ్ఞాన నివృత్తియే. భక్తి లేనిదే అది సాధ్యపడదు (118). జ్ఞానాజ్ఞానాలు రెండూ కలిసే వుంటాయి. వీటి నుండి అజ్ఞానాన్ని వేరు చేయాలి. అన్నం కావాలంటే బియ్యంలోని రాళ్ళను ఏరివేయాలి (119). సర్వత్రా, సర్వ ప్రాణులలోనూ భగవంతుడు వున్నాడన్న భావనతో జ్ఞానం, యజ్ఞాది ఉపాసనలు చేసి ఎవడైతే సర్వవ్యాపియైన పరమాత్మను చూడగలుగుతాడో, వాడు జ్ఞానం కోసం అజ్ఞానాన్ని దహించివేస్తాడు (120).

– సశేషం



# శ్రీ దత్తలీలామృతము

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)



June సంచిక తరువాయి

- శ్రీమతి శ్రీదేవి



ఇంద్రుని మాటలకు పకపకా నవ్వాడు బృహస్పతి. ఇంద్రునితో ఆయన యిలా అన్నాడు - "ఇంద్రా! తత్వశాస్త్రము కూడా శాస్త్రమే కదా? దానిని నీవు ఉత్తమమైనది అని ఒప్పకొంటావు కదా? ఇక యీ మిగిలిన సకల శాస్త్రములు అన్నీ తత్త్వశాస్త్రమును అందించేవే సుమా! ఈ శాస్త్రముల విజ్ఞానము వలన తత్త్వజ్ఞానాన్ని అందుకొనేందుకు అవసరమైన చిత్త శుద్ధి చేకూరుతుంది. అది క్రమముగా ఆత్మతత్త్వము వైపే దారి తీస్తుంది. అయితే యీ విషయం నీకు బాగా అర్థం కావటానికి నేను నీకు సప్త గాధలను ఉదాహరణలుగా చెపుతాను. వీనిని విని నీవే నీ మనస్సులో విచక్షణతో ఆలోచించి శాస్త్ర పరిజ్ఞానమును గురించి ఒక అవగాహనకు వచ్చి అపుడు నాతో మాట్లాడు. ఎందుకంటే శాస్త్రముల ప్రయోజనము ఏమిటో అపుడు నీకు తప్పకుండా స్పష్టపడుతుంది." అంటూ సప్తగాధలను యిలా చెప్పనారంభించాడు దేవగురువు బృహస్పతి.

ఇంద్రా! మొదటగా నీకు సిద్ధజుని కథ చెపుతాను శ్రద్ధగా ఆలకించు. గురువు ఇంద్రునికి విధిజ్ఞుని కథ యిలా చెప్పాడు - పూర్వము కాంపిల్య నగరంలో విధిజ్ఞుడు అనేవాడు ఒకడుండేవాడు. అతడు ఎంతో నీతిమంతుడుగా, ధర్మాతుడుగా పేరుగాంచాడు. పరమ శాంతుడు, సద్గుణ సంపన్నుడు అయిన విధిజ్ఞుడు గృహ, వాస్తు శాస్త్రములను క్షుణ్ణముగా అభ్యసించాడు. ఆ శాస్త్ర పరిజ్ఞానముతో ప్రజలకు సహాయపడుతూ మంచి పేరు ప్రఖ్యాతులు గాంచాడు. అతని సలహా తీసుకొనకుండా నగరంలో ఎవ్వరూ ఇల్లు కట్టుకొనేవారే కాదు. విధిజ్ఞుడు యీ కళద్వారా న్యాయంగా ఎంతో ధనం సంపాదించాడు. ఆ ధనంతో దానము, ధర్మము, శ్రాద్ధము, దేవార్చనము మొదలైన పుణ్యకార్యాలెన్నో చేస్తుండేవాడు. ఆ ధనికుడు గొప్ప దాత కూడా అవటంతో అతని ప్రతిష్ట ఎంతోగానో పెరిగింది. అతడు గృహ వాస్తు శాస్త్రంతో పాటు శిల్ప విద్యా పరిజ్ఞానం కూడా కలిగి వుండటం వలన అతనిని దేశదేశాలు మంత్రులు, రాజులు ఆహ్వానించి అతని ద్వారా తమ తమ పనులు జరిపించుకొంటుండేవారు. అతనికెంతో ధనము యిచ్చేవారు. ఆ విధంగా అతని సంపాదన ఎన్నోరెట్లు పెరిగింది. ధనంతోపాటు ధానధర్మాలు కూడా పెరిగాయి. ఆ ధర్మశీలుడు ఎల్ల జనుల మన్ననలను పొందుతూ ఎంతో పుణ్యాత్ముడుగా పేరొందాడు. అంతేకాదు. అతడు తనకు వచ్చిన శిల్ప, వాస్తు శాస్త్రములను ఉత్సాహవంతులైన ప్రజలకు నేర్పిస్తూ విద్యాదానం కూడా చేయసాగాడు. ఆ విధంగా ఎందరికో జీవనోపాధి కలిగించిన ఆ పుణ్యాత్ముడు జనులందరికీ ఆప్తుడుగా జీవించాడు. కొంతకాలానికి అతడు మరణించి,

చిరకాలం స్వర్గ సుఖాలననుభవించి, మరుజన్మలో బ్రాహ్మణుడై జన్మించాడు. ఆ బ్రాహ్మణుడు సర్వ శాస్త్ర పారంగతుడై విహిత కర్మములను యధావిధిగా ఆచరిస్తూ ఎన్నో యజ్ఞ యాగాదులను, బృహద్వ్రతములను చేశాడు. ఎన్నో ధర్మకార్యములు, దానములు, జపములు, తపములు నిర్వర్తించాడు. చివరకు వేదాంత శీలుడు, ధ్యాననిష్టుడు, యోగాసక్తుడు అయి క్రమముగా నాల్గవ ఆశ్రమము స్వీకరించి జీవన్ముకుడై తపించాడు. తుదకు ముక్తి ధామాన్ని చేరుకున్నాడు, విధిజ్ఞుడు.

మహేంద్రా! శిల్ప, వాస్తు శాస్త్రముల వలన అతడు ముక్తిని పొందగలిగాడు కదా! దీనికేమంటావు? కాబట్టి శాస్త్రములేవీ చెడ్డవి కావని అర్థం చేసుకో. ఇంద్రా! ఇందుకు నేను నీకు మరొక ఉదాహరణ వివరిస్తాను.

గురువు ఇంద్రునికి విశాలాక్షుని గాథ యిలా చెప్పాడు - పూర్వం మహిష్మతీ పురంలో విశాలాక్షుడు అనే ఒక అందమైన యువకుండేవాడు. అతడు కామశాస్త్ర పండితుడు. సంగీత విద్వాంసుడు. నటనా కౌశలము కలవాడు సాహిత్యము కూడా తెలిసినవాడు కావటంవలన ఆశు కవిత్వము కూడా చెప్ప గలిగేవాడు. అతడు వివాహం చేసుకోదలచి కన్యాన్వేషణ చేయసాగాడు. స్త్రీ లక్షణములు తెలిసిన వాడు కావటంవలన ప్రతి కన్యకకు ఏవో వంకలు పెట్టేవాడు. సకల శుభలక్షణములు వున్న యువతి కోసం అన్వేషించసాగాడు. అతడు ఎన్నో ఊర్లు తిరిగి ఎందరో కన్యలను చూచాడు. ఒక వూరిలోని పెద్దలొకరు "నీవు చెపుతున్న లక్షణాలన్నీ ఈ దేశపు రాజ కుమార్తెకు వున్నాయి, ఆమెయే నీకు తగిన కన్య." అని చెప్పగా విశాలక్షుడు రాజును కలిసి తన కోర్కెను తెలియజేశాడు. అత్యంత సుందరుడు, ధనవంతుడు, గుణవంతుడు అయిన ఆ యువకుని చూసి రాజు సంతోషించి తనకుమార్తెను అతనికి చూపించాడు. విశాలాక్షుడు ఆమెను తేరిపారచూశాడు. విశాలమైన ఆ కన్నుల సోయంగం, అప్పడే వికసించిన పద్మం లాంటి ఆ ముఖం, చక్కని శరీర సౌష్టవం చూచి ఆశ్చర్యపోయాడు. విచిత్రమేమంటే ఆమె ముఖం చుట్టూ తుమ్మెదలు తిరుగుతున్నాయి. ఆమెను పద్మినీ జాతి స్త్రీ గా గుర్తించాడు, విశాలాక్షుడు. అతడు యిన్నాళ్లకు కోరిన యువతి లభించిందన్న ఆనందాతిరేకంతో మైమరచిపోయాడు. అందగాడైన విశాలాక్షుని వివాహమాడేందుకు రాకుమార్తె అంగీకరించటంతో వారిరువురికీ వివాహం జరిగిపోయింది. రాజు వరునికి కానుకగా తన రాజ్యంలో కొంత భాగాన్ని అతనికి సమర్పించాడు.

విశాలక్షుడు రాజభోగాలన్నీ అనుభవించాడు, రాజ్యాన్ని ధర్మబద్ధంగా పరిపాలించాడు. ఈ విధంగా ధర్మార్థ కామములను సకాలములలో సాధించాడు. ఎన్నో యజ్ఞములు, దానములు చేశాడు. ప్రజల మన్ననలు పొందాడు. సంగీత సాహిత్య కళాకోవిదుడవటంవలన ఎప్పడూ నాదోపాసన చేస్తూ నాదబ్రహ్మానందంలో తేలియాడుతుండేవాడు.

కొంతకాలానికి ఆ దంపతులు దేహత్యాగం చేసిన తర్వాత గంధర్వనాదోపాసన ఫలితముగా గంధర్వపతియై విశాలక్షుడు జన్మించాడు. రాకుమార్తె అతని భార్యగా జన్మించారు. గంధర్వలోకంలో వారిరువురూ నాదోపానతో కాలంగడుపుతుండేవారు. ఒకసారి వాళ్లిద్దరూ కైలాసానికి వెళ్లి భవానీ సహితుడైన శివునికి సాష్టాంగ నమస్కారాలాచరించారు. భక్తి శ్రద్ధలతో వారిని పూజించారు. శివపార్వతుల ఎదుట మంజులస్వరముతో వారిని కీర్తిస్తూ గానం చేశారు. మహేశ్వరుడు గానలోలుడు

కావటంవలన వారి గానం విని ఎంతో ఆనందించాడు. "శృతిలయాన్వితమై అపస్వరములు లేక అత్యంత మనోహరమైన మీ గానం నాకెంతో సంతోషాన్ని కల్గించింది. మీ జన్మలు ధన్యమైనాయి. మీరు నా ఆజ్ఞ ప్రకారం స్వర్గలోకానికి వెళ్లి సుఖభోగములననుభవించండి" అని శివుడు దీవింపగా వారిరువురూ సంతోషించి పలుమార్లు శివపార్వతులకు మ్రొక్కి దివ్య విమానమునెక్కి స్వర్గ లోకమునకు వెళ్లారు. అక్కడ నందన వనంలో విహరిస్తూ, సకల సుఖాలననుభవిస్తూ తమ మధురగానంతో ఇంద్రునికి కూడా ఎంతో ఆనందాన్ని కలిగిస్తూ కాలం గడుపసాగారు.

అలా వుండగా ఒకసారి పరమేశ్వరుని యింట జరిగే ఒక వేడుకకు ఇంద్రునికి ఆహ్వానంరాగా అతడు ఆ వేడుకకు వెళ్తూ తమతో కూడా యీ గంధర్వ దంపతులను గూడా తీసుకొని వెళ్లాడు. ఆ సమయంలో గంధర్వులు, అప్సరసలు ఆడిపాడారు. ఇంద్రుని అనుమతితో యీ గంధర్వ దంపతులిద్దరూ సశాస్త్రీయముగా తమ నృత్యగానాలతో ప్రజాపతికి ఆనందాన్ని కలిగించారు. పరమేశ్వరుడు వారి నెంతగానో ఆదరించి, "నాద బ్రహ్మమును తెలిసికొన్నారు. ఇక పరబ్రహ్మమును తెలిసికొనండి. నేనే మీకు బోధిస్తాను." అని చెప్పి వారిని తన వద్ద వుంచుకొని సచ్ఛిదానంద లక్షణమయిన పరబ్రహ్మ తత్త్వమును వారికుపదేశించాడు. వారు కొంతకాలం జ్ఞాన సాధనచేసి తుదకు మోక్షాన్ని పొందారు. ఇంద్రా! చూశావా? కామ గంధర్వశాస్త్రములు విశాలాక్షుడిని ఏ విధముగా ఉద్ధరించాయో తెలిసిందా?" అన్నాడు బృహస్పతి.

దేవగురువైన బృహస్పతి ఇంద్రునితో "నీ సంశయాలు తీరటానికి మరొక వాస్తవగాథ వివరిస్తాను, విను" అంటూ మూడవ కథను యిలా చెప్పాడు.

బృహస్పతి ఇంద్రునికి వేదశర్మగాథను ఈ విధంగా చెప్పాడు -

పూర్వం విశాలనగరము అనే పేరుగల ఒక నగరంలో వేదశర్మ అనే బ్రాహ్మణుడొకడుండేవాడు. అతడు ధర్మాత్ముడు. వేద వేదాంగ పారంగతుడు. జితేంద్రియుడు. పుణ్యాత్ముడైన అతనికి సుశీలుడు అనే పేరుగల కుమారుడొకడుండేవాడు. పూర్వజన్మలలో చేసిన పాపముల వలన అతడిని ఏడుగురు బ్రహ్మ రాక్షసులు పట్టి పీడించసాగారు. ఆ బ్రహ్మ రాక్షసులు ఏడుగురు ఒకరినొకరు చంపి వేయాలనే క్రోధంతో వ్రపర్తిస్తుండటంతో సుశీలుడు ఎంతో బాధలకు గురి అయ్యేవాడు. ఇతనిని ఆవహించిన ఆ ఏడుగురు బ్రహ్మరాక్షసుల చేష్టల వలన సుశీలుడు ఒకప్పుడు పెద్దగా నవ్వటం, మరొకసారి ఏడ్వటం చేసేవాడు. అంతలోనే అరుస్తూ గంతులువేసేవాడు. పెద్దగా కేకలు పెట్టి మూర్ఛపోయేవాడు. కళ్లు, చేతులు గిరగిరా త్రిప్పేవాడు. భక్ష్యా భక్ష్యములు ఎరుగక తినేవాడు. నానా రకముల వికృత చేష్టలను చేసేవాడు.

ఇలా వున్న కొడుకును చూసి వేదశర్మ ఎంతో చింతించేవాడు. ఒకరోజు వేదశర్మ నిత్యనైమిత్తిక కర్మలు నిర్వర్తించి, వైశ్వదేవముచేసి యింటి బయటకు వచ్చి అతిథి ఎవరైనా కనిపిస్తారేమోనని ఎదురుచూస్తూ నిలుచున్నాడు. అదే సమయంలో ఒక బిచ్చగాడు ఆ వీధిలో వస్తూ కనిపించాడు. కానీ అతని రూపము, వేషము ఎంతో జుగుప్సాకరంగా వున్నాయి. ఒంటినిండా బూడిద పూసుకొని, చిరిగిన మురికి బట్టలు ధరించి వున్నాడు. శరీరమంతా దుర్వాసనవస్తూ అతని సమీపంలో నిలబడలేనంత అసహ్యకరమైన వేషంతో వున్న ఆ బిచ్చగానికి ధర్మాత్ముడైన వేదశర్మ ఎంతో గౌరవ ఆదరములతో భిక్ష యిచ్చాడు. ఆ సమయంలో అతని మనస్సులో ఒక ఆలోచన మెరిసింది. "ఉన్మత్త వేషంలో వున్నయితడు

ఒకవేళ దత్తాత్రేయుడు కాడు కదా! ఆస్వామి యీ వూరిలో భిక్షకై తిరుగుతూవుంటారని అంటారు. పిచ్చివాని వలె కన్పిస్తున్న యితడు సాక్షాత్తు దత్తస్వామియే అనిపిస్తున్నది. మతిస్థిమితంలేని నా పిల్లవాని వ్యాధిని నివారణ చేయటానికి నేను చేయని ప్రయత్నమే లేదు. ఎన్నిప్రయత్నాలు చేసినా, ఎన్ని చికిత్సలు చేయించినా ఏవీ ఫలించలేదు. ఇపుడు ఈస్వామి దయతో నా పిల్లవాడు స్వస్థత పొందుతాడు అనిపిస్తున్నది." అనుకొంటూ వేదశర్మ భిక్షచేసి వెళ్లిపోతున్న ఆ బిచ్చగాడిని వెంబడించాడు. అతడు ఎటు వెళ్తే అటు అనుసరిస్తూ వస్తున్న వేదశర్మను చూసి ఆ బిచ్చగాడు కర్రలతో, రాళ్లతో, మట్టితో కొట్టసాగాడు. ఏమి చేసినా బెదరక వేదశర్మ ఎంతో సంతోషంతో అతడి వెంటవెళ్లసాగాడు. అలా ఎంతో దూరం వెంబడించగా ఒకచోట ఒక గాడిద చచ్చిపడివుండటం చూచి ఆ భిక్షకుడు ఆ గాడిద శరీరాన్ని కోసి ఆ మాంసాన్ని బ్రాహ్మణుడికిచ్చి తినమన్నాడు. వేదశర్మ సంతోషంతో స్వీకరించగా బిచ్చగాడు కోపంతో వేదశర్మను కాళ్లతో తన్ని వెళ్లిపొమ్మని గట్టిగా కేకలు వేస్తూ వెళ్లి ఒక కొండ గుహలోకి వెళ్లి కూర్చున్నాడు. వేదశర్మ కూడా గుహలోకి వెళ్లి నమస్కరించి నిలబడగా, "ఏమిరా? నేనెక్కడికి వెళ్తే అక్కడకు వస్తున్నావు? నేనొక పిచ్చివాడిని. నాతో నీకేంపని? ఎందుకు నన్నీ విధంగా వెంబడిస్తున్నావు? వెళ్లు, వెళ్లు" అన్నాడు బిచ్చగాడు కోపంగా. వేదశర్మ కండ్లనీరు కారుతుండగా "ఓ స్వామీ! నన్ను దయచూడండి. బ్రహ్మ, ఇంద్రాది దేవతలే నీ మాయను తెలిసికొనలేరే ఇక అల్పుడనైన నేను ఎలా తెలిసికొనగలను? నన్ను యింకా పరీక్షించవద్దు. మీరు సాక్షాత్తు దత్తాత్రేయస్వామియే. ఇందులో ఎటువంటి సందేహంలేదు. నా పుణ్యఫలంగా యినాడు నాకు తమ దర్శన భాగ్యం లభించింది, మీ పాదాలు విడువను. రక్షించినా, శిక్షించినా యిక నాకు నీవే దిక్కు. నా పిల్లవాని దుష్కర్మలన్నీ యినాటితో నీ కృపా విశేషంతో తొలగి పోతాయని నమ్ముతున్నాను." అంటూ బిచ్చగాని పాదముల వద్ద సాష్టాంగ పడ్డాడు.

స్వామి నవ్వుతూ సాదరంగా అతనిని లేవనెత్తి, "బ్రాహ్మణోత్తమా! నీగురించి ఎరుగుదును. నీవెందుకు వచ్చావో కూడా తెలుసు. నీ కుమారుడిని ఏడుగురు బ్రహ్మరాక్షసులు పట్టి పీడిస్తున్నారు. నేను నీకు బీజాక్షర సహితముగా ఏడు మంత్రాలను యిస్తాను. ఒక్కొక్క మంత్రముతో ఒక్కొక్క గ్రహమును వెళ్లగొట్టాలి. ఒకేసారి ఏడు గ్రహములను వదిలించటం అసాధ్యం. ఏడు రోజులలో ఏడు గ్రహములు విడిచి వెళ్లిపోతాయి." అంటూ ఆ మంత్రములను సవిధానముగా బోధించాడు. స్వామి కరుణకు కరగిపోయిన వేదశర్మ స్వామిని పరిపరి విధముల స్తుతించి, నమస్కరించి, ఎంతో సంతోషంతో స్వామి వద్ద సెలవు తీసుకొని యింటికి బయలుదేరాడు. దారిలో చచ్చినగాడిద కనిపించిన స్థలంలో రక్తచందన వృక్షం వుండటం చూసి వేదశర్మ ఆశ్చర్యపోయాడు. స్వామి తనకు కోసి యిచ్చినది గాడిదమాంసం కాదు. అవి చందన పుష్పాలే అని వేదశర్మ గుర్తించాడు. స్వామి మహిమ నెంతగానో కొనియాడాడు. ఇంటికి వెళ్లి స్వామి చెప్పిన విధంగా మంత్రాలనుష్టానంతో ఏడు రోజులలో ఏడు గ్రహములను వెళ్లగొట్టాడు. ఆ విధంగా స్వస్థుడైన సుశీలుడు స్వామి అపారకృపతో పెరిగి పెద్దవాడై సకల విద్యాపారంగతుడైనాడు. వేదశర్మ సుగుణ సంపన్నురాలైన కన్యతో సుశీలుని వివాహం అత్యంత వైభవంగా జరిపించారు.

ఇక వేదశర్మ స్వామిచే అనుగ్రహింపబడిన మంత్రములతో ప్రజల గ్రహ బాధలు తీరుస్తూ ఎంతో పేరు ప్రతిష్టలు సంపాదించాడు. ఇతనిని మహాత్మునిగా తలచి ప్రజలెంతో గౌరవించేవారు. వేదశర్మ ప్రజల

సహకారంతో ఎన్నో చోట్ల బావులు, చెఱువులు, మందిరములు, మఠములు, ఆశ్రమములు నిర్మించి పుణ్యాత్ముడై జీవించాడు. జ్ఞానయోగ సాధనారతుడై చివరకు మోక్షాన్ని పొందాడు.

ఇంద్రా! చూశావా? మంత్ర శాస్త్రములు కూడా మోక్షదాయకాలే సుమా! వేదశర్మగాథే యిందుకు ప్రత్యక్ష నిదర్శనం" అన్నాడు దేవగురువు బృహస్పతి.

గురువు ఇంద్రునికి విష్ణుదత్తుని కథ యిలా వివరించాడు -

సహ్యాద్రి సమీపంలో మాతాపురము అనే నగరము ఒకటి వున్నది. ఆ నగరంలో విష్ణుదత్తుడు అనే బ్రాహ్మణుడు ఒకడుండేవాడు. ఆయన భార్య సుశీల మహా పతివ్రత. వారి యింటి ముందు ప్రాంగణంలో ఒక రావిచెట్టు వుంది. ఆ రావిచెట్టుపై ఒక బ్రహ్మ రాక్షసుడుండేవాడు. ప్రతిరోజూ విష్ణుదత్తుడు భూతబలి ఆ వృక్షంవద్ద ఆహారాన్ని వుంచేవాడు. చెట్టుపై వున్న బ్రహ్మరాక్షసుడు ప్రతినిత్యము ఆ భూతబలి అన్నము తింటూ ఆ యింట్లోని వారి జోలికి మాత్రం పోకుండా వూరిలోని యితరులను బాధిస్తుండేవాడు. ఇలా కొంత కాలం గడిచింది.

ఒకరోజు బ్రహ్మరాక్షసుడికి విష్ణుదత్తుని పై ఎంతో ప్రేమ కలిగి, కృతజ్ఞతా భావంతో అతనికేదైనా మేలు చేయాలన్న ఆలోచన కలిగింది. ప్రతినిత్యం వలే ఆ రోజు కూడా విష్ణుదత్తుడు భూతబలికై ఆహారం రావిచెట్టు వద్ద వుంచుతున్న సమయంలో బ్రహ్మరాక్షసుడు తన నిజరూపంతో కన్పించాడు. తన రూపాన్ని చూచి భయపడుతున్న విష్ణుదుత్తునితో ఎంతో వినమ్రత వుట్టిపడే విధంగా ఎంతో సౌమ్యంగా చేతులు జోడించి నమస్కరిస్తూ బ్రహ్మ రాక్షసుడు యిలా అన్నాడు. "అయ్యా! భయపడవద్దు. నేను మీకు హాని చేసేవాడనుకాను. తమరు ఎంతో దయతో ప్రతిరోజూ భూతబలి అన్నమును ప్రసాదిస్తున్నారు. ఆ అన్నమును ప్రతినిత్యం భుజించి ఎంతో సంతృప్తి చెందుతున్నాను. మీరు చేస్తున్న యీ అన్న దానానికి ప్రతిగా మీ ఋణం తీర్చుకొనటానికి నేను మీకేదైనా మేలు చేయదలచాను. మీకేమి కావాలి? మీకు ఎలాటి సహాయమైనా చేయటానికి సిద్ధముగా వున్నాను. దయచేసి తెలియజేయండి."

బ్రహ్మరాక్షసుని మాటలు విన్న విష్ణుదత్తుడు ఆశ్చర్యపోయాడు. అతనికి ఏమి కోరుకోవాలో కూడా స్ఫురించలేదు. అతడు పరుగు పరుగున లోపలికి వెళ్లి భార్యను పిలిచి, సంగతంతా చెప్పాడు. సకల సుగుణ సంపన్నురాలు, మహా పతివ్రత అయిన ఆమె "స్వామీ! ఐహికమైన కోరికలను కోరటం వలన ప్రయోజనం ఏముంటుంది? అవన్నీ అశాశ్వతాలు కదా! మహా యోగులు, ఋషులు, సర్వసంగ పరిత్యాగులు వేలాది యేండ్లు తపస్సు చేస్తూ ఎవని దర్శనానికై తపిస్తూ వుంటారో ఆ పరమేశ్వరుడు, పరంధాముడు శ్రీ మహావిష్ణు అవతారుడైన శ్రీ దత్తాత్రేయస్వామి దర్శనాన్ని పొందాలని వున్నది. కాబట్టి ఈ బ్రహ్మ రాక్షసుడు ఏదోకోరినా, ఆ కోరిక నెరవేరుస్తానని అంటున్నాడు కదా! శ్రీ దత్తస్వామిని చూపించమని అడగండి. మన అదృష్టం వలన మీకు బ్రహ్మరాక్షసుడు దత్తస్వామి దర్శనం చేయించగలిగితే అంతకన్న మహద్భాగ్యం మనకేముంటుంది?" అన్నది. ఆమె సలహా ప్రకారం బ్రాహ్మణుడు బ్రహ్మ రాక్షసుని వద్దకు వచ్చి యిలా అన్నాడు.

**- సశేషం**

---

# వార్తాలాపము

June సంచిక తరువాయి (సీరియల్)

## శాస్త్రవాసన

అనేక శాస్త్రములను అధ్యయనము చేయవలెనను వాసన శాస్త్రవాసన. ఇది మూడు రకములు 1. పాఠ్యవ్యసనము, 2. బహుశాస్త్రవ్యసనము, 3. అనుష్ఠానవ్యసనము.

1. శాస్త్రములన్నియు చదివి పూర్తిచేయవలెనను కోరిక పాఠవ్యసనమను వాసన. ఆ విధముగా ఎవరును చేయలేరు. అందుచేతనే అది మలినవాసన. భారద్వాజుడు మూడు పురుషాంతరములు (75 సంవత్సరములు) అధ్యయనము చేసినను శాస్త్రములు పూర్తి అవలేదు. ఇంద్రుడు అతనికి మరియొక పురుషాంతరము (25 సంవత్సరములు) సమయము ఇచ్చెదనని ఆశపెట్టెను. భరద్వాజుడు ఆ 25 సంవత్సరములలోను కూడ వేదాధ్యయనము చేయుటకు ప్రయత్నించెను. కాని శాస్త్రాధ్యయనము పూర్తి కాలేదు. ఈసంగతి ఇంద్రుడు భరద్వాజునకు తెలుపగా నాతడు అధ్యయనమును త్యజించి ఇంద్రుని ఉపదేశముచే సగుణబ్రహ్మోపాసనమును ఆరంభించెను. కావుననే విద్వాంసులు చెప్పిరి.

అనన్తశాస్త్రం బహువేదితవ్యమల్పశ్చకాలో బహవశ్చ విఘ్నాః।
యత్సారభూతం తదుపాసితవ్యం హంసో యథాక్షీరమివామ్బుమిశ్రమ్ ॥

శాస్త్రములు అనంతములు. శాస్త్రప్రతిపాదితములగు అర్థములు కూడ అనంతములు. పదార్థజ్ఞానము అల్పకాలమున కలుగదు. కాని మానవాయుర్దాయము చాలతక్కువ. ఈ చిన్న ఆయుర్దాయమునందే రోగాదులు, అనేక విఘ్నములు కలుగును. ఇట్లు విఘ్నములతో కూడిన చిన్న ఆయుర్దాయముద్వారా సర్వశాస్త్రములను అధ్యయనముచేయుట అసంభవము. కావున హంస నీరు కలసిన పాలనుండి క్షీరమును మాత్రమే గ్రహించునట్లు అధికారి సర్వశాస్త్రసారభూతమగు పరమాత్మని యథార్థజ్ఞానమగు అర్థమును గ్రహించవలెను.

2. అభ్యాసముకొరకు అనేకవిధములగు శాస్త్రములను వెతకుట బహుశాస్త్రవ్యసనము. ఈ వ్యసనము దూర్వాసునియందు ఉండెను. దుర్వాసుడు అనేక శాస్త్రముల భారముతో శంకరుని నమస్కరించుటకు వెళ్ళుచుండెను. నారదుడు సభలో అందరియెదుట అతడు బరువుమోయు గాడిదతో సమానుడని పలికెను. దూర్వాసునకు క్రోధము వచ్చి ఆ భారము అంతయు క్షీరసముద్రమున పారవేసెను. అటు తరువాత అతడు శంకరుని దర్శించెను. శంకరుడు అతనికి ఆత్మ విద్యోపదేశము చేసెను. కావున అనేకరకములగు గ్రంథములను సంగ్రహించుట అనెడు మలిన వాసనను కూడ ముముక్షువు త్యజించవలెను.

3. వేదశాస్త్రములయందు విధించబడిన కర్మానుష్ఠానమందే ఆయుష్షమంతయును గడపుట అనుష్ఠానవ్యసనము అనబడును. ఈ అనుష్ఠానవ్యసనము నిదాఘుడను రాజుయందు ఉండెను.

ఋభుడను ముని అతనికి ఎంతైనను నచ్చచెప్పెను. అయినను అతడు కర్మలయందు శ్రద్ధ అను జడత్వమును విడనాడలేదు. దాశూరుడు అనేవానికి తన కర్మానుష్ఠానమునకు వలయు పవిత్ర ప్రదేశము భూమియందు ఎంత వెదకినను ఎక్కడను దొరకలేదు. ఈ కర్మవాసన పునర్జన్మకు కారణము. కావున మలినమైనది. శాస్త్రవాసనకూడ దర్పాదులకు కారణమగుటచే పరమార్థతత్త్వము తెలిసికొనునంతవరకు మాత్రమే శాస్త్రాధ్యయనము ఆచరిణీయము.

**దేహవాసన**

1. దేహాత్మత్వము, 2. గుణాధానము, 3. దోషాపనయనము అని భ్రాంతి భేదమున దేహవాసనమూడు రకములు.

1. దేహమునందు ఆత్మత్వబుద్ధిని దృఢపరచి దానినే పోషించుచుండుట దేహాత్మత్వము. "విరోచనునకు ప్రజాపతి పరమార్థతత్త్వమును ఉపదేశించెను. అయినను అతడు తనచిత్తమునందలి దోషముచే దేహమునందే ఆత్మభావమును స్థిరపరచి అసురులందరకును దేహమే ఆత్మ అని బోధించెను." అని ఛాందోగ్యోపనిషత్తునందు ఉన్నది. ఈనాడు విరోచనమతానుయాయులు చాలమంది కాననగుదురు. తమశరీరమును పోషించుటయందు తత్పరులయి, భక్ష్యాభక్ష్యములను, గమ్యాగమ్యములను విచారించకుండ కేశరచనాదులద్వారా విచిత్రములగు వేషములను వేసికొని విలాసములను అనుభవించువారు అందరును విరోచనమతావలంబులే.

అది సరియగు మతము కాదు. ఏలయనిన; "ఆత్మ అనగా జీవాత్మ దేహముకంటే భిన్నమైనది." అనునది జ్ఞానుల అనుభవము. ఈ శరీరము మలమూత్రాదులతో నిండియున్నది. క్షణభంగురము. కావున ఒకరోజున విసరివేయవలసినదే. అయినను దానిని అందముగాను, బలముగాను ఉంచుటకు రకరకములగు ఔషధములను ఉపయోగించెదరు. దేహమునకు క్షణికములగు విలాసవైభవములు కలుగజేయుటకు ద్రవ్యాధిసాధనములను సంపాదించుటకై నీతి, అవినీతి, న్యాయము, అన్యాయము అనునవి కూడ విచారించుట కనబడుట లేదు. ఎవరికైనను దుఃఖము కలిగినను లక్ష్యముచేయక ధనమును సంపాదించినకాని క్షుద్రములగు వైభవములు అనుభవించలేక పోవుచున్నాము కదా! కావున మృత్యువు లేని ఆత్మను పొందుటకు ఎంత గొప్ప పురుషార్థము చేయవలెనో యోచింపుడు.

2. గుణాధానము రెండురకములు. 1) లౌకికము, 2) వైదికము. కోమలమగు కంఠముతో గానముచేయుటకును, వేదాదులను చదువుటకును కంఠమును బాగుచేసికొనుటకు ఔషధాదులను సేవించుచుందురు. అటులనే శరీరమునకు పుష్టికర ఔషధములను సేవించుట, ఆహారమును తినుట, సౌందర్యముకొరకు సుంగధతైలములను పట్టించుట, సుందరవస్త్రాదిభూషణములను ధరించుట,

సువాసనకల అత్తరులు, సెంట్లు మొదలగువాటిని ఉపయోగించుట ఇవి అన్నియును లౌకికములగు గుణాధానములు. పుణ్యముకొరకు గంగాస్నానాదులు చేయుట, సాలిగ్రామాదులు సంపాదించుట మొదలగునవి వైదిక గుణాధానములు.

3. దోషాపనయనము. అనగా దోషములను పోగొట్టుట కూడ లౌకికము, వైదికము అని రెండు రకములు. చికిత్సాశాస్త్రమున చెప్పబడిన ఔషధముల ద్వారా శరీరమునందలి దోషములను పోగొట్టుట లౌకికము. శౌచ, ఆచమనాదులద్వారా పవిత్రమగుట వైదికము.

ఈ దేహవాసన జ్ఞానప్రతిబంధకము. కావున ముముక్షువు దీనికి దూరముగా నుండవలెను.

## దేహవాసన నివృత్తికి ఉపాయము

ఈ విషయమున శంకరభగవత్పాదులు చెప్పిరి.

సంసార బన్ధవిచ్ఛిద్యేతద్ద్వయం ప్రద హేద్యతిః।
వాసనావృద్ధిరేతాభ్యాం చిన్తయా క్రియా బహిః॥

“సంసారము (జన్మమరణరూపసంసారము) అను బంధమును నశింపజేయుటకు విషయచింతన, విషయప్రవృత్తి ఈరెంటిని సాధకుడు దహించివేయవలెను. విషయచింతన, విషయప్రవృత్తి ఈ రెండింటి తోను వాసన వృద్ధిని పొందును.”

ఎట్లన, మీవద్ద ఒక గుర్రపుబండి ఉన్నచో రెండు గుర్రపు బండ్లు కావలెనని తలచుట విషయ చింతన. ఆ ప్రకారము రెంటిని సంపాదించి దానియందు కూర్చొనుట బాహ్యక్రియ. ఈ బాహ్య క్రియయే విషయభోగము. దానితోనే వాసన వృద్ధిపొందును. కావున పైరెండిటినీ ఏదోవిధముగా నశింపజేయవలెను.

తాభ్యాం ప్రవర్ధమానా సా నూతే సంసృతిమాత్మనః।
త్రయాణాం చ క్షయోపాయః సర్వావస్థాను సర్వదా॥

“ఈ రెండును పెరిగినకొలదియు వాసన ఆత్మను జనన మరణములనెడు సంసారముతో చేర్చును. ఈ దేహవాసనలు మూడింటిని నశింపజేయుటకు సర్వకాలసర్వావస్థలయందును ప్రయత్నించవలెను.”

పాముకు పాలు త్రాగించినకొలదియు దాని విషయము పెరుగును. అటులనే విషయములయందు ప్రవర్తించినకొలదియు దేహవాసన పెరుగును. “దేహమే నేను” అను భావము దృఢపడును. కావున ఈ దేహవాసనను పరిత్యజించుటతో బాటు శుభవాసనను అనుష్ఠించవలెను.

సర్వత్ర సర్వతః సర్వం బ్రహ్మమాత్రావలోకనైః।
సద్భావవాసనాదార్ఢ్యాత్త్రితయం లయమశ్నుతే॥

"అన్నిటియందును, అన్ని విధములుగను, అంతయును బ్రహ్మమేనని చూచుటచే బ్రహ్మభావము అను వాసన దృఢపడి పైన చెప్పిన మూడును నశించును."

అనగా సర్వమూ బ్రహ్మమే అను అభేదోపాసనచే జగమునందలి పదార్థములయందలి రాగద్వేషములు నశించుటచే క్రియ, ఇచ్ఛ, వాసన ఈమూడును నశించును.

శుద్ధవాసనాలక్షణము యోగవాశిష్ఠమునకూడ చెప్పబడనది -

పునర్జన్మాన్మూలం త్యక్త్వా స్థితం సంభృష్టబీజవత్।

దేహార్థం ధ్రియతే జ్ఞానజ్ఞేయా శుద్ధేతి చోచ్యతే॥

"జననము యొక్క మూలమును నశింపజేసి, జ్ఞేయతత్త్వము యొక్క జ్ఞానము లభింపజేయు వాసన మొలచిన బీజమువంటిది. అది శుద్ధమగు వాసన."

మలినవాసన నశించువరకు తత్త్వజ్ఞానము కలుగదు.

తత్త్వజ్ఞానము, వాసనాక్షయము అన్యోన్యాశ్రయములు.

"ఈ దృశ్యమానమగు సర్వప్రపంచమును మిథ్య. అద్వితీయడగు ఆత్మ పరమార్థరూపుడు. కావున ఆత్మ స్వరూపుడు. ఆత్మకు భిన్నమగు పదార్థము వేరొకటి లేదు" అనునది తత్త్వజ్ఞానము. ఈ తత్త్వజ్ఞానోపపత్తి - సిద్ధి కలిగినప్పడు విషయాభావముచే వాసనా క్షయము అగును. తత్త్వజ్ఞానాభావము ఉన్నంతవరకు అనగా తత్త్వజ్ఞానము కలుగనిదే పదార్థములయందలి సత్యత్వప్రతీతి నివృత్తిని పొందదు. వాసనాప్రవాహము అంతకంతకు ముందుకు సాగుచునే యుండును. ఈ విధముగా వాసనాక్షయమునకు తత్త్వజ్ఞానము కారణము. దేహవాసనాది మలినవాసనలచే చంచలమగు చిత్తమునందు ఆత్మజ్ఞానము కలుగు యోగ్యత లేదు. ఇట్లు తత్త్వజ్ఞానమునకు వాసనాక్షయముకూడ కారణమే.

తత్త్వజ్ఞానమునకు రెండు రకములగు సాధనములు కలవు.

1. అంతరంగసాధనములు, 2. బహిరంగసాధనములు.

యజ్ఞయాగాదులు బహిరంగసాధనములు. వివేకాదులు అంత రంగసాధనములు ఎనిమిది. అందును వివేకము, వైరాగ్యము, షట్‌సంపత్తి, ముముక్షుత్వము అను వానికంటె శ్రవణము, మనము, నిదిధ్యాసనము ఎక్కువ అంతరంగికములు. అంతకంటెను "తత్త్వమసి" అను మహావాక్యముచే "తత్" పదము యొక్కయు, "త్వం" పదము యొక్కయు అర్థమును శోధించుట ఎక్కువ అంతరంగికము.

వివేకాదుల లక్షణములను అపరోక్షానుభూతియందు శంకరులు వ్రాసిరి.

నిత్యమాత్మస్వరూపం హి దృశ్యం తద్విపరీతగమ్।

ఏవం యో నిశ్చయః సమ్యగ్వివేకో వస్తువః సవై॥

"ఆత్మస్వరూపము నిత్యము. దృశ్యమగునది దానికి విపరీతము. ఈవిధముగా పదార్థనిశ్చయము వివేకము."

- సశేషం

# శ్రీ భరద్వాజ లేఖామృతము



**acharya.E.bharadwaja**

"Dwarakamayi",
VIDYANAGAR - 524 413,
NELLORE Dt., (A.P)
Camp :
Date : 26/4/82



**acharya.E.bharadwaja**

"Dwarakamayi",
VIDYANAGAR - 524 413,
NELLORE Dt., (A.P)
Camp :
Date :

58-8-5(1)

# శ్రీ భరద్వాజ లేఖామృతము

''Dwarakamayi''
VIDYANAGAR-524413
NELLORE Dt. (A.P)
*camp :*
*Date : 26/4/82*

చి॥సౌ॥ కమలా రామచందర్ గార్కి,

సాయి ఆశీస్సులు. ఇంతకాలం తర్వాత మీ జాబు చూచి చాలా సంతోషించాము. మీ దక్షిణదేశయాత్ర గూర్చి తెలిసి... అయితే మేము విద్యానగర్‌లో లేనందుకు, మిమ్ములను చూడలేనందుకు బాధగానే వున్నది.

స్థానిక నాస్తిక, హేతువాదులు మన సాయి ప్రచారకార్యాలేన్నో విఘ్నాలు కల్పించ యత్నించి, విఫలులై, కక్షబూని స్థానిక రాజకీయ నాయకుల స్వార్థాన్ని రెచ్చగొట్టి మాకెంతో యిబ్బంది కల్గించడమేగాక ఎన్నో అజ్ఞాత కల్పనలు చేస్తూ దుష్ప్రచారానికి పొల్పడ్డారు. తద్వారా అన్యాయంగా మా నుండి ఆర్థిక సహాయాన్ని లభ్యం చేస్తామని ఆశచూపి ఒక కుటుంబం చేత ఎన్నో అసత్యాలు కల్పిస్తున్నరు. ఈ సమస్యల కారణంగా సాయి సూక్తులననుసరించి మనమే తొలగియుండడం మంచిదని దీర్ఘకాలపు శెలవుమీద ఒంగోలులో కుటుంబాన్నుంచి సాయి ప్రచారార్థం తీవ్రంగా పర్యటిస్తున్నాను. ఇదీ కారణం -మీరు వచ్చినప్పుడు మేము విద్యానగర్‌లో లేకపోవడానికి. భక్తులీప్రాంతంలో నా కుటుంబానికి ఆశ్రమం నెలకొల్పి, ప్రచురణాలయానికి నివసమేర్పరచి నేను ఉద్యోగం వదిలి ఆధ్యాత్మిక కార్యక్రమానికంకితమయ్యే అవకాశం కల్పించాలని ఎంతో శ్రమిస్తున్నారు. ఒంగోలులో అమ్మగారు, పిల్లలు క్షేమం.

నేను హైదరాబాద్ వచ్చినప్పుడు తప్పక సత్సంగ సభ్యుల దర్శనం చేసుకోగలను. వచ్చేముందు తెల్పుతాను. శ్రీ రామచందర్ గార్ని అడిగినట్లు చెప్పండి. మీ అందరి క్షేమసమాచారాలు తెల్పుతూండవలసినది.

సదా సాయిసేవలో
మీ
భరద్వాజ

నా యింటి చిరునామా:-

ఇ. భరద్వాజ
58-8-5(1)
రామకూరివారి వీధి,
సంతపేట, ఒంగోలు.

జై సాయిమాస్టర్

# గురువును తెలుసుకోవాలి

గురుపూర్ణిమ ప్రత్యేక వ్యాసం - అలివేలు మంగమ్మ

"గురువును తెలుసుకోవాలి. లేకపోతే ఎందుకు వచ్చినట్లు? పిడకలు ఏరుకోవడానికా?" అని శ్రీ శిరిడీ సాయిబాబా అన్నారు. (శ్రీ సాయి లీలామృతం - సూక్తులు). అసలు గురువును తెలుసుకోవడమంటే ఏమిటి? గురువును దర్శించడమా? ఆయనకు సాష్టాంగ ప్రణామాలు చేసుకోవడమా? ఆయనను గూర్చిన లీలలను స్మరించుకోవడమా? ఆయనకు సేవ చేయడమా? ఆయనను గూర్చి ఉపన్యాసాలు యివ్వడమా? భజనలు చేయడమా?

ఇవన్నీ దాదాపు అందరమూ చేస్తూనే వున్నాము. మరి అటువంటప్పుడు మనం గురువు గూర్చి తెలుసుకున్న వాళ్ళమవుతున్నామా? ఇంకా ఏమైనా తెలుసుకోవలసి వున్నదా? ఈ విషయంలో మాస్టరుగారు చెప్పినదానిని కొద్దిగా వివరించుకుందాము.

అసలు తెలుసుకోవడం ఎన్నో రకాలు. ఆయనను చూసి ఆయన స్వరూపాన్ని తెలుసుకోవడం. అంటే బాబా ఎలా వుంటారోనని మాస్టరుగారు తెలుసుకున్నట్లు. ఆయనను చూసిన వాళ్ళము ఆయన రూపం ఎలా వుంటుందో ప్రత్యక్షంగా తెలుసుకుని వుంటామని చెప్పుకోవచ్చు. చూడని వాళ్ళు, చూసిన వాళ్ళు చెప్పినదానిని బట్టి, చిత్రపటాలను బట్టీ, వీడియోలను బట్టి తెలుసుకోవచ్చు. తర్వాత ఆయన కంఠస్వరం, మాటతీరు, మాట్లాడే విధానం మొదలగునవన్నీ గూడ కొంతవరకూ మనం తెలుసుకోవడానికి అవకాశం వుంది. ఇక ఆయన గుణగణాలు, స్వభావము, జీవిత విధానములు గూడ కొంత పరిచయము వున్నవారు, కొంతకాలం ఆయనతో సన్నిహితంగా వున్నవారూ వారి వారి సంస్కారము, అవగాహన మేరకు తెలుసుకోవడానికి అవకాశం వున్నది.

అయితే ఆయన జీవిత విధానాన్ని గూర్చి, ఆయన చెప్పే విషయాలను గూర్చి ఆచరించే ధర్మసూక్ష్మాల గురించి తెలుసుకోవడం కష్టమే. ఎందుకంటే, ఆయన ఏ ఒక్కరికీ అంతుబట్టరు. అందుకని ఆయనను పూర్తిగా తలుసుకోవడం అసాధ్యమనే చెప్పాలి. అయితే మనకు తెలిసినంతవరకూ చాలునులే అని ఊరుకోవడమా? లేక యింకా యింకా ఆయన గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించడమా? అదేనా గురువును గూర్చి తెలుసుకోవడమంటే?

ఈ విషయంలో మన ప్రశ్నలన్నింటికీ సమాధానంగా పూజ్యశ్రీ మాస్టరుగారు గురువును గురించి ఎలా తెలుసుకోవాలో ప్రత్యక్షంగా ఆచరించి చూపారు. అదే మనము గూడ అనుసరించవలసినది. ఇక్కడ అనుసరించడం అంటే అనుకరించడం కాదని తెలుసుకోవాలి. అనుసరించడమనుకొని మనం ఆయనను అనుకరించడానికి ప్రయత్నించే ప్రమాదం ఎప్పుడూ పొంచివుంటుంది. దానిని జాగ్రత్తగా గమనించుకుంటేగాని, తెలియదు.

పూజ్యశ్రీ మాస్టరుగారి లాగా, లుంగీ బనీను ధరించి అర్ధ పద్మాసనంలో కూర్చొనడము, ఆయనలాగా

సిగరెట్లు కాల్చడము. కాఫీ ఎక్కువసార్లు త్రాగడమూ గూడా అనుసరించడమనే తలచవచ్చు. మామూలుగా మనకు అలాంటి అలవాట్లు అంతకుముందునుంచే వుండివుంటే పరవాలేదు కానీ, ఆయనను అనుసరిస్తున్నామని అలాచేయడం మటుకు సరికాదు. ఈ విషయం పూజ్యశ్రీ మాస్టరుగారే యిలా చెప్పారు. "బాబాను అనుసరించడమంటే బాబా లాగ తలగుడ్డ, కఫ్నీ ధరించి చిలిమ్ త్రాగడం కాదు. ఆయనలాగా వుండవలసిన అవసరం ఏమాత్రం లేదు. కారణం ఆయన తమ గురువు లాగా వున్నారా? రామకృష్ణపరమహంసలాగా వివేకానందుడు వున్నాడా? రమణమహర్షిలాగా మరొకరెవరైనా వున్నారా? అందుకని బాబాను అనుసరించడానికి అలా వుండాల్సిన అవసరం లేదు. పైగా ఆయన వేషధారణ మనం చేసుకుంటే ఆయనంతటి వారము మనము అనే అహంకారం రావడానికి అవకాశం వుంది. ఆయనలాగా అన్నీ చేయలేని వాళ్ళము ఆయన వేషధారణ చేయడంలో అంతరార్థమేమిటో ఆలోచిస్తే తెలుస్తుంది. అదీగాక మనం ఆయన పాదాలచెంత వుండవలసినవాళ్ళము. అప్పుడు వాళ్ళ వేషధారణ మనం అనుసరిస్తే అది గురువు వద్ద వుండవలసిన వినమ్రత లేని వాళ్ళమవుతాము. నిజమైన వినమ్రత వుంటే అలాంటి పనులు చేయలేము గూడ. కనుక ఆయన చెప్పిన వాటిని ఆచరించడమే ఆయనను అనుసరించడం.

అందుకని పూజ్యశ్రీ మాస్టరుగారు ఆచరించి చూపినట్లు మనం గూడ మన గురుదేవులైన పూజ్యశ్రీ మాస్టరుగారిని గురించి యింకా యింకా తెలుసుకోవడానికి, ఆయన చెప్పిన వాటిని ఆచరించడానికి ప్రయత్నించాలి.

సామాన్యంగా మనము పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి ఎంతో తెలుసుకుంటాము. కానీ ఆలోచించిన కొద్దీ ఆయన గురించి ఎంతో తెలియదని తెలుస్తుంది.

ఆయన కరుణామయులనీ, అందరికీ ఎన్నో విధాలుగా సహాయం చేసేవారని, అందరినీ ఎంతో ప్రేమగా చూసేవారనీ, ఎంతో క్షమాగుణం కలవారనీ, శాంత స్వరూపులనీ ఇలా ఎన్నో విషయాలు మనకు తెలుసు. కానీ ఆయనలో మనకు తెలియని, తెలుసుకోవడం కష్టమైన, ఆయన ఆచరించిన ధర్మ సూక్ష్మాలు చాలావున్నాయి. అవి మనం తప్పకుండా తెలుసుకొని తీరాలి. ఆచరించాలి. అవే ఆయన చెప్పక చెప్పిన సత్యాలు. ఉదాహరణకు ఆయన అందరిపట్ల ఎంతో శ్రద్ధ వహించేవాడు. ఈ సంగతి మనందరికీ తెలిసిన విషయమే కదా? అని మన కనిపించవచ్చు. కానీ ఎంతటి శ్రద్ధ వహించేవారో కొద్దిగా వివరించుకుందాము.

'శ్రద్ధ' అనే పదానికి అర్థం - మమకారంతో గూడిన లేక ప్రేమతో గూడిన జాగ్రత్త లేక ఆసక్తి అని చెప్పుకోవచ్చు. ఈ శ్రద్ధ అనేది మనిషికి చాలా అవసరం. అటు ఆధ్యాత్మికోన్నతికి గాని, ఇటు ఐహిక శ్రేయస్సుకుగానీ శ్రద్ధలేనిదే ప్రయోజనం వుండదు. అందుకే పెద్దలు 'శ్రద్ధవాన్ లభతే జ్ఞానం" అన్నారు. ఇక్కడ 'జ్ఞానం' అన్న పదానికి ఆధ్యాత్మిక జ్ఞానం అని మాత్రమే కాదు. 'శ్రద్ధ గలవాడు దేనినైనా సాధించగలడు' అని అర్థం.

మనం కొన్ని విషయాలలో జాగ్రత్త తీసుకుంటాము. కొన్ని విషయాలలో జాగ్రత్త తీసుకోము. కొన్ని విషయాలలో అతి జాగ్రత్త తీసుకుంటాము. అతి జాగ్రత్త కొన్ని సందర్భాలలో అవసరమే అయినప్పటికీ 'అతి

ఎవరి గురించీ తప్పుగా మాట్లాడవద్దు.

సర్వత్ర వర్జయేత్ అన్నట్లు అన్ని విషయాలలోనూ మంచిది కాదు.

సామన్యంగా చాలామంది తమపట్ల శ్రద్ధ వహిస్తారు. దానిలో కూడా కొందరికి శరీరం పట్ల ఎక్కువ శ్రద్ధ వుంటుంది. కొందరికి ఆరోగ్యం పట్ల, కొందరికి సౌందర్యం పట్ల, కొందరికి దుస్తులు, ఆభరణాలు-యిలా ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా వుండవచ్చు. మరికొందరు యీ విషయాలన్నింటి పట్ల గూడా శ్రద్ధ వహించవచ్చు. అయితే కొందరు ఒక విషయంలో శ్రద్ధ వహించి మిగతా వాటిని అశ్రద్ధ చేస్తారు.

అలాగే కొందరు భర్త పట్ల లేక భార్యపట్ల, పిల్లలపట్ల, తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు-ఇంకా యితరులు-అలాగే చదువు, ఉద్యోగం, వ్యాపారం- ఇలా అనేక విషయాలలో అనేక రకాలుగా వారి వారి సంస్కారాన్ని బట్టి శ్రద్ధ వుంటూ వుంటుంది.

అయితే యీ శ్రద్ధ అనేది మానవునికి ఎలా వుండాలి? ఎంతవరకూ వుండాలి? అన్నది ముఖ్యంగా తెలుసుకోవసిన విషయమే. అది తెలుసుకోవాలంటే పూజ్యశ్రీ మాస్టరుగారి జీవిత విధానాన్ని గూర్చి తెలుసుకుని తీరాలి.

పూజ్యశ్రీ మాస్టరుగారు కేవలం ఒక్క విషయంలోనే కాదు, అన్ని విషయాలలోను అందరిపట్ల శ్రద్ధ వహించి వుండేవారు. ఒక విధంగా చెప్పాలంటే సకల జీవులపట్ల, సర్వకాల సర్వావస్థలలోన శ్రద్ధ వహించే వుండేవారని చెప్పాలి. ఎందుకంటే సకల జీవరాశులలోనూ వున్న విశ్వచైతన్యంతో ఆయన తాదాత్మ్యం చెందివుంటారు గనుక. అందుకే అలావుండడం మహాత్ములకు మాత్రమే సాధ్యమేమో!

ఆధ్యాత్మికతలో గొప్పవారుగా అంటే బాబాలు, అమ్మలు, స్వామీజీలు - యిలా చాలామంది చేత భగవంతునిగా ఆరాధింపబడేవారిలో చాలామందిలో మనం చూసేదేమిటంటే వారు కేవలం ఆధ్యాత్మిక చింతనలోనే వుండడము, అలాంటి విషయాలపట్లనే శ్రద్ధ వహించడమూ జరుగుతూ వుంటుంది. లౌకిక విషయాలపట్ల అంటే తమ కార్యక్రమాలకు సంబంధించనివాటి పట్ల - వారిపట్ల శ్రద్ధ వహించడం సామాన్యంగా చూడము. అందుకనే ఆధ్యాత్మిక చింతన కలవారంటే లౌకికమైన విషయాలను పట్టించుకోరు అనే అభిప్రాయం ప్రజలకు ఏర్పడింది.

అందుకని పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి గూడ కొంతమంది అలా అనుకోవడానికి అవకాశమున్నది. ఆయన కేవలం ఆధ్యాత్మిక ప్రపంచంలోనే జీవిస్తుంటారని, సాయిబాబా తప్ప ఆయనకు మరొకధ్యాసే వుండదనీ కొందరు అనుకుంటారు. కారణం ఆయన నిరంతరం సాయిబాబా గురించి చెప్పడము, పుస్తకాలు వ్రాయడము చేస్తుంటారు గనుక, కానీ ఆయన ఆది మాత్రమేగాక ప్రతివారిగురించి ప్రతి చిన్న విషయం దగ్గరనుంచి ఎంతో శ్రద్ధగా పట్టించుకుంటారన్నది చాలా మందికి తెలియదు.

ఆయన తమ చదువుపట్ల ఎంతో శ్రద్ధ వహించారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేనందువలన పుస్తకాలు-

వస్త్రాలు- ఇంకా యితర పరిస్థితులూ అనుకూలంగా లేనప్పటికీ ఎంతో శ్రద్ధ వహించి అనుకున్న చదువుపూర్తి చేసారు. అలాగే సృష్టితత్వం గురించి, జనన మరణాల గురించి తీవ్రంగా అన్వేషించారు. శ్రద్ధగా గమనించి వాటి మూలాన్ని తెలుసుకున్నారు. శరీర తత్త్వాన్ని గురించి, మానసిక తత్త్వాన్ని గురించి శ్రద్ధగా గమనించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అలాగే యిటు ఆధ్యాత్మిక రంగంలోను, వైజ్ఞానిక రంగాలకు చెందిన అనేక రకాలైన పుస్తకాలను లౌకిక, సామాజిక రంగాలకు - యిలా ఎన్నో రంగాలకు చెందిన పుస్తకాలనెన్నింటినో శ్రద్ధగా చదివి వాటిని అవగాహన చేసుకున్నారు.

శ్రీ సాయిబాబా అనుగ్రహం చవి చూశాక శ్రీ సాయిబాబా గురించి ఎంతో శ్రద్ధగా తెలుసుకున్నారు. అంతేగాక బాబా గురించి లోకానికి తెలియబరచేందుకు ఆయనెంతో శ్రద్ధ వహించారు. ఎన్నో సంవత్సరాల పాటు బాబా గురించి తెలుసుకొని ఆయన తత్త్వాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాత గూడ ఇంకా యింకా ఆయన లీలలగూర్చి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వుండేవారు. ఆయన లీలల విశ్లేషణ జరుపుతూనే వుండేవారు. అందుకే ఆయన రచించిన 'శ్రీ సాయిలీలామృతం' ప్రతి ముద్రణలోనూ మార్పులూ చేర్పులూ చేస్తూనే వుండేవారు. ప్రతిసారీ అలా మార్చడం వల్ల తమ పుస్తకాలను భక్తులందరూ మళ్ళీ కొనవలసివస్తుంది గనుక డబ్బులు సంపాదించుకోవడానికి ఆయన ఈ మార్గాన్ని ఎంచుకున్నారని కొందరు విమర్శించారు. అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు యిచ్చిన సమాధానం మనకెంతో అవసరం. ఎందుకంటే అది ఆయనకు బాబా పట్ల వున్న శ్రద్ధను తెలియజేస్తుంది. ఆయనిలా అన్నారు, "నేను డబ్బు సంపాదించాలనుకుంటే నాకు ఎన్నో మార్గాలు తెలుసు. నేను వేరే ఎలాంటి పుస్తకాలనయినా వ్రాయగలను. వాటి వల్ల నాకు కుప్పలు తెప్పలుగా డబ్బులు వస్తాయి. అయినా డబ్బులు సంపాదించడానికి పుస్తకాలు వ్రాయవలసిన అవసరం కూడా లేదు. ఎన్నో మార్గాలున్నాయి. కానీ యిక్కడ నా లక్ష్యం ఒక్కటే - "శ్రీ సాయినాధుని గూర్చి ప్రపంచానికి ఎంత బాగా తెలియజేయగలనా?"అని. అందుకే ఈ నా ఆరాటం. ఆయనింకా యిలా అన్నారు : "మనం బయటకు వెళ్ళేటప్పుడు మన శరీరాన్ని సోపులతో కడిగి, వివిధ రకాలైన పౌడర్లు, క్రీములు రాసుకుని, ఏది ఉపయోగిస్తే యింకా మన ముఖం అందంగా కనిపిస్తుందోనన్న ఆరాటంతో రకరకాల సౌందర్య సాధనాలను ఉపయోగిస్తుంటాము. ఎన్నో రకాల దుస్తులను మార్చుకుంటూ వుంటాము. ఎందుకూ పనికిరాని మన ముఖాలకే అందంగా మెరుగులు దిద్దుకుని బయటకు వెళ్తామే! అలాంటప్పుడు విశ్వమంతటికీ శ్రేయస్సును చేకూర్చే సాయినాధుని గురించి ప్రపంచానికి తెలియజేసే ప్రయత్నంలో ఆయనను ఎంత అందంగా ప్రజలముందుకు పంపించాలి? మన శరీరాన్ని అందంగా చూపించుకోవడం వల్ల మనం అందంగా వున్నామని మనలను అనుకుంటే అనుకోవచ్చు. లేక ఆ సౌందర్యం పట్ల కొందరికి వ్యామోహం కలిగే అనర్థం గూడ దాగివున్నది. కానీ సాయినాధుని అందంగా తీర్చిదిద్దడంలో ప్రపంచ శ్రేయస్సు ఇమిడి వున్నది సుమా! అందుకని ఎవరు ఏమి అనినా అనుకున్నా నేను నా ప్రయత్నాన్ని మాత్రం చేస్తూనే వుంటాను?"

ఆయన బాబాకు తమ జీవితాన్ని అంకితం చేసారు గనుక ఆయనకు అంత శ్రద్ధ వుండడం సహజమే. కానీ ఆయన లౌకిక విషయాలలో గూడ అంతటి శ్రద్ధనూ వహించేవారు. ఆయన చర్యలను నిశితంగా పరిశీలిస్తే ఈ విషయం మనకు స్పష్టంగా తెలుస్తుంది. నిరంతరం ఎంతోమంది ఆయన వద్దకు వస్తున్నా, ఎన్నో పనులలో, వ్యవహారాలలో ఆయన వుంటున్నప్పటికీ భార్య బిడ్డల పట్ల ఆయన వహించే శ్రద్ధ ఆయనను సన్నిహితంగ చూసిన అందరకూ విదితమే. పిల్లలు ఆహారం సరిగా తీసుకున్నారా? లేదా? మందులు సకాలంలో వారికి వేస్తున్నారా? లేదా? చదువులెలా చదువుతున్నారు? మొదలైన విషయాల దగ్గరనుంచీ వారి ప్రవర్తన ఎలా ఉన్నదో దాకా ఆయన గమనిస్తూనే వుండేవారు. అంతేగాక ఇంట్లో వున్న వాళ్ళందరికీ ఎప్పుడేమి అవసరమో తెలుసుకుంటుండేవారు. వాళ్ళ అనారోగ్యాలకు హోమియో మందులు చెబుతుండేవారు. వారి లౌకిక పరిస్థితులకు తగిన సలహాలనిస్తుండేవారు. మానసిక ఆందోళనలు, చికాకులు మొదలైన వాటిని సరిదిద్దుతూండేవారు.

విద్యార్థులయొక్క చదువుపట్ల, ఉద్యోగాలపట్ల ఎంతో శ్రద్ధ వహించేవారు. వారికి సరిపడిన ఉద్యోగావకాశాలను పత్రికలలో చదివి వారికి ఆ ఉద్యోగ ప్రయత్నం చేసి చూడమని జాబులు వ్రాసేవారు. ఎవరికైనా ఆరోగ్యం సరిగా లేదని తెలస్తే వారిని ఫలానా డాక్టరు దగ్గరకు వెళ్ళమని గానీ, ఫలానా మందు వాడితే బాగుంటుందనీ గానీ చెప్పేవారు.

ఇంటికి వచ్చినవారి భోజనం గురించి, వారికి పడుకోవడానికి వసతి దగ్గరనుంచి ఆయన జాగ్రత్త తీసుకునేవారు. వాకిట్లో తిరిగే కుక్కలపట్ల, పిల్లులపట్ల గూడ ఆయనెంతో శ్రద్ధ వహించేవారు. సకలమూ తానైన శ్రీ సాయిస్వరూపులైన ఆయనకు అందరూ ఆయనవారే! అందుకే ఆయనకంత ప్రేమ అంతటి శ్రద్ధ మనం విపరీతంగా ప్రేమించే దేని పట్లనైనా మనకెంత శ్రద్ధ వుంటుందో గమనించుకుంటే మనకే ఈ విషయం తెలుస్తుంది.

"కేవలం ముక్కుమూసుకుని కూర్చోడం మాత్రమే ఆధ్యాత్మికత కాదు. లౌకిక జీవితంలో వుంటూ వైరాగ్యం కలిగి వుండి, ధర్మప్రవర్తన, అందరిపట్ల నిస్వార్థప్రేమ లేనిదే ఆధ్యాత్మికత లేదు. సరియైన లౌకిక జీవిత విధానము లేకుండా ఆధ్యాత్మిక చింతనలోనే గడుపుదామనుకోవడం ఒక కాలు కుంటి లాంటిది. అది సరియైన నడక కాదు. నిజమైన వైరాగ్యం కలిగి ఈ ప్రపంచంతో ఎట్టి సంబంధమూ లేక అన్నీ విడిచి వెళ్ళిన వారికి మాత్రమే అది సరిపోతుంది," అనేవారు పూజ్యశ్రీ మాస్టరుగారు.

"శ్రద్ధ-మానసిక శ్రద్ధ, శారీరక శ్రద్ధ అని రెండు రకాలు. కొందరు కొన్ని విషయాలలో మానసిక శ్రద్ధ వహిస్తారు, శారీరక శ్రద్ధ వహించరు. ఉదాహరణకు కొన్ని పనులు యాంత్రికంగానో, లేక కర్తవ్యంగానో చేస్తారుగానీ ఇష్టంతో అంటే మనస్ఫూర్తిగా చెయ్యరు. మరికొన్ని పనులు చేయడం చాలా యిష్టంగా వుంటుంది. కానీ శారీరక యత్నం చేయడానికి బద్ధకం అడ్డువస్తుంది. అందుకని చెయ్యబుద్ధి కాదు. అలాగాక ప్రతిపనీ మానసిక, శారీరక శ్రద్ధతో చేయడమే సరియైన శ్రద్ధ" అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెబుతుండేవారు.

"అసలు మరీ అంత శ్రద్ధగా వుండడం అవసరమా? వుండకపోతే ఏమైపోతుందిట" అని ఎవరైనా అనుకోవచ్చు. మనకు అన్నీ బాగున్నంతవరకూ అంతా బాగానే వుంటుంది. మన అవయవాలలో ఏ ఒక్కటి సరిగా పని చేయకపోయినా మనం శ్రద్ధ చేస్తే ఎలా వుంటుందో తెలుస్తుంది. అలాగే మనం ఎవ్వరినీ పట్టించుకోకపోతే అవతలి వాళ్ళ పరిస్థితి మనకు అర్థం కాకపోవచ్చు. కానీ మనకేదైనా ఎటువంటి అవసరమైనా వస్తే అవతలివాళ్ళు మనలను పట్టించుకోకపోయినా, ఒక వేళ పట్టించుకున్నా సరియైన శ్రద్ధ వహించకపోయినా అప్పుడు మన మనస్సు ఎంత బాధపడుతుందో అనుభవిస్తేగానీ తెలియదేమో!

అలాగే ఆధ్యాత్మిక విషయానికొస్తే శ్రద్ధ అనేది అత్యంత ప్రధానమైనది. భక్తి లేకుండా చేసే ఆరాధన వ్యర్థమని పెద్దలు చెబుతారు. నిజమైన భక్తి కలగాలంటే శ్రద్ధ అవసరం. శ్రద్ధ లేకపోతే సరియైన భక్తి సాధ్యం కాదు.

ఆయనను గురువుగా ఆరాధించే మనము, ఆయన మనపట్ల చూపించిన శ్రద్ధతో నూరవవంతైనా ఇతరులపట్ల చూపించగలిగితే ఆయన చెప్పిన మార్గంలో పయనించే వాళ్ళమవుతాము. లేకపోతే ఆయన ఒక ఉపన్యాసంలో చెప్పినట్లు ఆయన చెప్పిందంతా వ్యర్థమే అవుతుంది. బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

తమకు తెలిసినవారి పట్లనే గాక తెలియనివారి పట్ల, సకల జీవుల పట్ల రాబోయే తరాల పట్ల పూజ్యశ్రీ మాస్టరుగారు చూపించిన శ్రద్ధ ఒకటున్నది - అదే ఆధ్యాత్మికత. అసలైన ఆధ్యాత్మికత గురించి, మహాత్ముల గురించి, వారిని సేవించడం వల్ల వచ్చే ఫలితాల గురించి, ధర్మప్రవర్తన గురించి ఆయన చెప్పిన ఉపన్యాసాలు, వ్రాసిన రచనలు - వీటిని అశ్రద్ధ చేయక, శ్రద్ధగా చదివి సరియైన శ్రద్ధను అలవరించుకుందాము.

ఈ రోజున ఆయన పరిచయమున్న వారమంతా మాస్టరుగారి గురించి చెప్పుకునేటప్పుడు "ఆయన నా పట్ల ఎంత శ్రద్ధ వహించేవారో!" అని చెప్పుకుంటున్నామంటే అది ఆయనకు మనపై వుండే ప్రేమ వల్లనే. అంటే ఎక్కువ ప్రేమ, లేక మానవ సహజమైన మమకారము వుంటాయో, అక్కడ శ్రద్ధ తప్పనిసరిగా వుంటుందని స్పష్టమవుతుంది.

ఇది పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి మనం తెలుసుకోవలసిన ఒక చిన్న విషయం మాత్రమే ఆయన జీవన విధానం చూస్తే ఇలాంటివి తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో వున్నాయి. మనకు తెలియని విషయాలు ఇంకెన్నో!! అయినా పూజ్యశ్రీ మాస్టరుగారు బాబా గురించి యింకా యింకా తెలుసుకోవాలని ఎలా ఎంతగా ప్రయత్నించేవారో, అలాగే మనం గూడ ఆయన గూర్చి యింకా యింకా తెలుసుకోవడానికి ప్రయత్నం చేద్దాము. అదే "గురువును తెలుసుకోవడం" లోని రహస్యమేమో!

అలా గురువు గురించి తెలుసుకోవడానికి తాపత్రయ పడడము, ప్రయత్నించడమే "పిడకలేరుకునే" సమయాన్ని సద్వినియోగ పరచుకోవడమేమో!! ఆలోచించండి! అనుగ్రహస్వరూపులైన పూజ్యశ్రీ మాస్టరుగారిని అలాంటి తపనను, శ్రద్ధను మనకు అనుగ్రహించమని మనసారా ప్రార్థిస్తున్నాను.

---

# కుండ చేసిన కుమ్మరి!

- ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్

"కుమ్మరి కుండలను చేస్తాడు"–అని చిన్నప్పుడు చదువుకుంటాము. అది అర్థం అవటం పెద్ద కష్టం ఏమీ కాదు. కానీ కుండే కుమ్మరిని చేసిందంటే మహా విడ్డూరంగా ఉంటుంది. అది వాస్తవమైతే అంతా తల్లక్రిందులౌతుంది.

భగవంతుడు సర్వాన్నీ సృష్టించాడనీ, మానవుణ్ణి కూడా, సృష్టించాడనీ అన్ని మతాలూ, మహాత్ములూ చెప్తారు. నిజానికి ఇంతటి అద్భుతమైన, విచిత్రమైన, సంకీర్ణమైన సృష్టిని చేయగలగడమంటే అది భగవంతునికే సాధ్యం. అందులోనూ మహామేధస్సు కల్గిన మానవజాతి ఉద్భవించాలంటే అది తప్పక భగవత్సంకల్పం వల్లనే జరిగి ఉండాలి.

కానీ ఈ రోజుల్లో అన్నింటిలాగే ఈ విషయం కూడా తారుమారైంది. భగవంతుడు ఇలా ఉంటాడని ఒకరు, కాదు అలా ఉంటాడని ఒకరు, వాదించుకొని కమీటీలు వేసి, పార్టీలు కట్టి, ఓట్లు వేసుకుని అధ్యక్షుణ్ణి ఎన్నుకొని, అట్టి అధ్యక్షుని అభిప్రాయాన్ని బట్టి తమకు తోచిన "భగవంతుని" సృష్టించుకొని తికమక పడుతున్నాడు మనిషి. కల్లుతాగిన పిచ్చికోతికి ఆకలేసి గంతులేస్తుంటే కాల్లో ముల్లు గుచ్చుకుందట. ఇక దాని గోలకి అంతు ఉంటుందా? అలాగే అసలే తికమక పడుతున్న మనిషికి ప్రాంతీయ అభిమానం, దేశాభిమానం తోడై, "తమవాడు" అనుకున్న లోకల్ నాయకుడి అభిప్రాయాన్ని బలపరచుకునే యత్నంలో మతాల(అభిప్రాయాలు) మధ్య వైషమ్యాలేర్పరచుకొని కీచులాటల నుంచి యుద్ధాల దాకా అనేక రీతులైన గోలలు చేస్తున్నాడు మనిషి. ఇదే గోల కొత్త ప్యాషన్‌లను అనుసరించి "మా గురువు గొప్ప" అంటే "మా గురువు గొప్ప", "మా గురువు చెప్పింది ఇది" అంటే "కాదు మా గురువు చెప్పింది అది", అని కొట్టుకుచస్తున్నాం. ఈ గొలలో ఇండిపెండెంట్ అభ్యర్థుల్లాగా "మాకు తెల్సిన Science ప్రకారం దేవుడే లేడ"ని బొబ్బలు పెడుతున్న క్రొత్త బృందం తయారైంది. కుమ్మరి కుండలను చేస్తే బాగుంటుంది కానీ కుండే కుమ్మరిని చేస్తే ఇట్లానే అంతా తల్లక్రిందులౌతుంది. భగవంతుడు కుమ్మరి అనుకుంటే, మనుష్యులు కుండలనుకుంటే, పై వాక్యం సరిగా అర్థం చేసుకుంకుంటే ఎన్నో చికాకులు వదుల్తాయి. ప్రతి కుండా తలకొక కుమ్మరిని ఊహించుకోవటంకంటే అసలు కుమ్మరి ఎవరో తెల్సుకుంటే ఆయనే అన్ని కుండలకు కుమ్మరి అని అర్థమై సమస్యలు తీర్తాయని ఈ కుండ అభిప్రాయం. ఇది ఉపయోగకరమో లేక మరో క్రొత్త పార్టీయో కాలమే నిర్ణయించాలి. లేదా ప్రతీ 'కుండా' ప్రయత్నించి తెల్సుకోవాలి.

జై సాయి మాస్టర్!!

# Donations List

## Annadanam List

| | | |
|---|---|---|
| 1. V.S. Satyanarayana | Hyderabad | 1350.00 |
| 2. Smt. Saraswathi Nagaraju | Bangalore | 1343.00 |
| 3. Venkateswaralu | Bhimanapalli | 2000.00 |
| 4. Alapati Someswara Rao | Chintalapudi (W.G.) | 2011.00 |
| 5. Smt. V. Manga Nancharamma | Hyderabad | 1350.00 |
| 6. C. Satyanadhan & K. Subba Rao | Vijayawada | 1500.00 |
| 7. J.V. Subba Rao | Mumbai | 1350.00 |
| 8. G. Radha Krishna Rao | Hyderabad | 1343.00 |
| 9. Velamati Venkayamma | Mandapaka | 1343.00 |
| 10. Sri Addala Dinesh Narayana | UK | 1343.00 |
| 11. K.S. Arun Kumar | Tirupathi | 1343.00 |

## School List

| | | |
|---|---|---|
| 1. G. Brahmaiah | Chirala | 500.00 |

## General Donation

| | | |
|---|---|---|
| 1. Sri Ch. V. Padmavathi | Ramachandrapuram (E.G.) | 1116.00 |
| 2. Sri Chi. Srinivasamurthy | Ramachandrapuram (E.G.) | 5000.00 |

జై సాయి మాస్టర్ !!

ప్రియ గురు బంధువులారా! జగద్గురు శ్రీ సాయిమాస్టర్ ఆధ్యాత్మిక సేవలనందించడానికి, దివ్యజనని అలివేలుమంగమ్మ భరద్వాజుల ఆశీస్సులతో 'శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్' స్థాపించబడినది. సాయిమాస్టర్ భక్తులు, జిజ్ఞాసువులు–పుస్తకములు, ఫోటోలు మొదలగు వాటికొరకుగాని, విరాళములు మరియు Magazine Subscriptions మొదలగు అన్ని విషయములకు ఇకనుండి ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు. D.D.లు, M.O.లు కూడా ఈ క్రింది అడ్రసుకు పంపించగలరు.

**Sri Manga Bharadwaja Trust**,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone :040-20063300

**పూజ్య శ్రీ సాయిమాస్టర్ సేవాభిలాషులు యీ క్రింది చిరునామాలకు విరాళాలర్పించి తరించగలరు.**

**Magazine** మరియు **General Donations** ను **"Sri Manga Bharadwaja Trust"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Annadanam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Sai Master)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Ashramam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Peace Foundation)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల్వారా పంపగలరు

**Books order** ను **"Sri Manga Bharadwaja Trust (Publications)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు.

**శ్రీ సాయిమాస్టర్ సేవాభిలాషులకు మనవి, ప్రస్తుతము గురుకులము నిలిపివేసినందున గురుకులముకై విరాళములు పంపరాదు. గురుకులమునకు పంపు విరాళములు శ్రీ సాయిమాస్టర్ నిత్యాన్నదాన సేవకు వినియోగించబడును.**

**పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 50-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 15-00 |
| విజ్ఞాన వీచికలు | 50-00 |
| పరిప్రశ్న | 40-00 |
| మతమెందుకు? | 30-00 |
| ఏది నిజం? | 30-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 40-00 |
| బుద్ధధ్యాన హృదయం | 30-00 |
| దత్తావతార మహత్మ్యం | 40-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 80-00 |
| పురుషసూక్త రహస్యం | 30-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 45-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 25-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 30-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 45-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 35-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 40-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 40-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 40-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 55-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 70-00 |
| Supreme Master (Swami Samartha) | 60-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 60-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |

SRI GURUPADUKA PUBLICATIONS
c/o, **Sri Manga Bharadwaja Trust,**
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**